నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
గురువారం | డిసెంబర్ 19, 2024 | www.navatelangana.com

ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ

నవ తెలంగాణ -నకిరేకల్

నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే మూసపాటి కమలమ్మ పదవ వర్ధంతి సందర్భంగా బుధవారం తెలంగాణ యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లం సత్తయ్య యాదవ్, ఏర్పుల రేణుక లింగయ్య యాదవ్, వెంకటేశం యాదవ్ ,కదిరి రమేష్, కొండ అంజమ్మ ఆరాల వెంకన్న, సాయికుమార్, ఉపేందర్, యశ్వంత్,పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన

నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని యరగండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద,పంచాయతి సెక్రెటరీ శ్రవణ్ కుమార్,అంగన్వాడి టీచర్లు రజిత,మమత, ఆశా వర్కర్,తల్లులు,చిన్నారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

నవ తెలంగాణ- నకిరేకల్



విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని నకిరేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ మల్లారెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో తల్లిదండ్రుల అధ్యాపకుల సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఎస్ డబ్ల్యు ఓ సి హెచ్ వెంకటేశం ఎస్ సి బి హాస్టల్ వార్డెన్ యాదగిరి హాజరై మాట్లాడుతూ అధ్యాపకులు చెప్పేది శ్రద్ధగా విని విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మద్దెల శ్రీనివాస్, విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సంపదను కొల్లగొడుతున్న మోడీ ప్రభుత్వం

- ఆరుగ్యారంటీలు కాంగ్రెస్ అమలు చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజల సంపదను మోడీ ప్రభుత్వం కొల్లగొడుతున్నదని, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి విమర్శించారు.. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో మిర్యాలగూడ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నారన్నారు. దేశంలోని మతోన్మాద శక్తులు, దాని అనుబంధ సంఘాలు అధికారంలో ఉండటం వల్ల మైనారిటీ, మతాలపై రోజురోజుకు తీవ్రమైన దాడులు పెరుగుతున్నాయన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన ఆర్థిక విధానాలను అమలు చేస్తూ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని బీజేపీని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని మాటలకే పరిమితమైందని, 40 శాతం మంది రైతుల కంటే ఎక్కువ రైతులకు రుణాలు మాఫీ చేయలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల హక్కులకు కేంద్ర ప్రభుత్వం హరిస్తుందని, నిధులు మంజూరు చేయటంలో పక్షపాత ధోరణి వ్యవహరిస్తుందని కేంద్ర ప్రభుత్వం మత ధోరణులు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రజలను చైతన్య పరచడంలో సిపిఎం పార్టీ సభ్యులు ముందుండాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల వారసత్వం కొనసాగించాలన్నారు.ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి, మంగారెడ్డి, చౌగానిసీతారాములు, మండల నాయకులు పిల్లుట్ల సైదులు, చనగాని సైదమ్మ, కందుకూరు రమేష్ బాబు కన్నెకంటి రామకృష్ణ, పొదిలా శ్రీనివాస్,కోట్ల శ్రీనివాస్ రెడ్డి,గోవిందరెడ్డి,బొగ్గారపు కృష్ణయ్య,ఉన్నం వెంకటేశ్వర్లు,మట్టపల్లి వెంకటేశ్వర్లు, కాంతారెడ్డి,కోన్ రెడ్డి వెంకటరెడ్డి,జిల్లా నగేష్,మంగ,గూడా నాగేంద్ర ప్రసాద్, సువార్త,మర్రి పద్మ,తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా చేయాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- చింతపల్లి ఎంపీడీవో కు షోకాజ్ నోటీసు జారీ కలెక్టర్

నవతెలంగాణ -చింతపల్లి



ఎవరైనా విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించడం, కిందిస్థాయి సిబ్బందికి యాప్ వివరాల నమోదుపై అవగాహన కల్పించనందుకు చింతపల్లి ఎంపీడీవో సుజాతకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. బుధవారం మండలంలోని ఘాసిరాం తండాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారు ఇండ్ల కు వెళ్లి సర్వే బృందం యాప్ లో నమోదు చేసిన వివరాలను సెల్ఫోన్ ద్వారా పరిశీలించారు. రమావత్ శంకర్, కొర్ర సరిత తదితర దరఖాస్తుదారుల ఇండ్లను పరిశీలించి అక్కడ వివరాల నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ దరఖాసుదారుల ఇంటితో సహా తీసుకున్న పొటో, అలాగే ఇంటి ధ్రువపత్రాల అప్లోడింగ్ వివరాలను అడగగా, ఫొటో అప్లోడ్ చేయకపోవడం, ధ్రువపత్రాలు లేక తాత్కాలిక అప్లోడ్ చేయడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సిబ్బందికి యాప్ పరిశీలనపై ముందే అవగాహన ఎందుకు కల్పించలేదని, సర్వే పై గ్రామంలో ముందే ప్రజలకు చెప్పకపోవడం పై ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటీస్ జారీ చేయాల్సిందిగా ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు సర్వే బృందాలు వచ్చినప్పుడు గ్రామాలలో తప్పనిసరిగా దరఖాస్తు దారు ఇంటి వద్ద ఉండాలని, ఇంటి ముందు నిలబడి ఫోటోతో సహా యాప్ లో అప్లోడ్ చేసేలా ఫోటో దిగాలని, అంతేకాక ఇంటికి సంబంధించిన ధ్రువపత్రాలు, ఆధార్ తదితర ధృవపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పునరుద్ఘాటించారు.సర్వే బృందాలకు ఏ రోజు సర్వే నిర్వహించే ఇండ్ల దరఖాస్తుల వివరాల డాటాను మాత్రమే అప్లోడ్ చేయాల్సిందిగా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్ కుమార్ ను ఆదేశించారు. మాస్టర్ డేటాను సర్వే బృందాలకు ఇవ్వడం వల్ల వారు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంటుందని, అందువల్ల సంబంధిత గ్రామానికి సంబంధించి ,ఆ రోజు సర్వే నిర్వహించే ఇళ్లకు సంబంధించిన వివరాలు మాత్రమే ఆరోజు అప్లోడ్ చేయాలన్నారు.గతంలో ఏదైనా కారణం చేత ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా దరఖాస్తు చేసుకో లేకపోయిన వారు ఇప్పుడు ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన మీ-సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.అనంతరం జిల్లా కలెక్టర్ నసర్లపల్లి గ్రామంలో సైతం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే ను పరిశీలించారు. దరఖాస్తు దారు లక్ష్మమ్మ ఇంటికి వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లా? ఆర్ సి సి న లేక పెంకుటిళ్ల అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే బృందం వచ్చినపుడు లక్ష్మమ్మ అందుబాటులో లేకపోవడంతో ఆమెను పిలిపించి ఫోటో దింపాలని సర్వే బృందానికి సూచించారు.ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251442 నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయాలని కలెక్టర్ ప్రజలకు తెలిపారు.అలాగే అధికారులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, సిబ్బంది దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన సందేహాలను ఈ నెంబర్ కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ

నవతెలంగాణ - చండూరు

గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెలా 22 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందిస్తున్నారు. ఇటీవల చండూర్ ఎస్సై వెంకన్న గౌడ్ నిరుపేదలను, వారి స్థితిగతులను చూసి చలించిపోయాడు. 15 రోజులుగా విపరీతమైన చలి ఉన్నందున గమనించి నిరుపేదలకు దుప్పట్లను, చీరలను ఇవ్వాలని గాంధీజీ ఫౌండేషన్‌కు పంపించారు. బుధవారం స్థానిక గాంధీజీ విద్యాసంస్థలలో గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు వారికి దుప్పట్లను, చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయార్ధ హృదయంతో ఎస్సై వెంకన్న గౌడ్ పేదలకు దుప్పట్లు, చీరలు పంపడం ఆయన సేవా గుణానికి నిదర్శనమని అన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

నవతెలంగాణ- చింతపల్లి

బుధవారం చింతపల్లి మండలంలో అక్రమ డిప్టెషన్ల పై పనిచేస్తున్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల ఎంఈఓ నీరడు అంజయ్య కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిలివేరు నారాయణ, ముసుగు ఆనంద్ బాబు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా డిప్టేషన్స్ లేని సందర్భంలో కొంతమంది ఉపాధ్యాయులు తమ సొంత ప్రయోజనాల కోసం విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ వివిధ పాఠశాలలకి డిప్యూటేషన్ పై వెళ్లారు. అక్రమ డిప్యూటేషన్ పై పోలేపల్లి రామ్ నగర్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ,ఎంపీపీఎస్ చింతపల్లి లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల డిప్టేషన్ రద్దుచేసి వారి సొంత పాఠశాలలకు వెంటనే పంపించాలని కోరారు..

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ- నకిరేకల్

నకిరేకల్ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ నూకల రఘునందన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు రాచకొండ వెంకన్న , గుర్రం గణేష్, నాయకులు పెండం సదానందం, సామ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

నవ తెలంగాణ -నకిరేకల్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను బీఆర్ టి యు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్ సింగ్, ఆర్. రాజేందర్, గడ్డం సమ్మయ్య, దశరథ, ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

వీర్లపాలెంలో పశువైద్య శిబిరం

నవ తెలంగాణ-దామరచర్ల

మండలంలోని వీర్లపాలెం గ్రామం లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం గోపాలమిత్ర పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 54 గేదెలకు పరీక్షలు నిర్వహించి, పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించినారు.మరో 28 దూడలకు నట్టల నివారణ మందులను తాపించారు. ఈ కార్యక్రమంలో మండ పశువైద్యాధికారి డాక్టర్ సందీప్ , ఉపేందర్, గోపాలమిత్ర సూపర్వైజర్ శివారెడ్డి , గోపాల మిత్రలు రాంబాబు, ప్రభాకర్. దైద శ్రీను, పాల్గొన్నారు.

సాంబశివరావు మృతదేహానికి నివాళి

నవ తెలంగాణ- నాగర్జునసాగర్

నాగార్జునసాగర్ పైలాన్ కాలనీకి చెందిన సాగర్ ప్రాజెక్ట్ రిటైర్డ్ ఉద్యోగి ఏ. సాంబశివరావు (80)అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం నాడు మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ సాంబశివరావు తాను రాజకీయాలలో ఉన్నప్పటినుండి తనకు తెలుసునని నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనని ఎప్పుడూ కలుస్తూ ఉండేవాడని అన్నారు. సాగర్ ప్రాజెక్టు ఉద్యోగుల సంఘానికి ఎంతగానో సేవలు అందించిన సాంబశివరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. వీరితోపాటు జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, తిరుమలగిరి సాగర్ ఎంఈఓ శ్రీను వాస్, కాంగ్రెస్ నాయకులు జంగయ్య, సుమన్, ఉద్యోగ సంఘాల నాయకులు రాజా, శ్రీనివాసరెడ్డి, అలు పూరి శ్రీనువాస్, వర్క్ చార్జెడ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ఉన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-మిర్యాలగూడ



రాష్ట్ర ప్రభుత్వం వానాకాలం, యాసంగి పంటలకు తక్షణమే రైతుబంధు నిధులను ఒకేసారి విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన ఎన్నికల ముందు ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ రైతులందరికి అమలు కాలేదని ఇంకా 40శాతం రైతులు రుణమాఫీ వస్తుందా రాదా అని ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రవి నాయక్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాగిరెడ్డి మంగారెడ్డి, కల్లుగీత సంఘం జిల్లా కార్యదర్శి చౌగాని సీతారాములు, సిఐటియు జిల్లా నాయకులు మల్లు గౌతమ్ రెడ్డి, రైతు సంఘం మిర్యాలగూడ మండల అధ్యక్షులు పి. గోవింద్ రెడ్డి, రైతు సంఘం మిర్యాల మండల కార్యదర్శి కోట్ల శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గోలి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పిల్లుట్ల సైదులు, కందుకూరి రమేష్, చనగాని సైదమ్మ, బొగ్గారపు కృష్ణయ్య, కన్నకంటి రామకృష్ణ, కాంత రెడ్డి, పొదిళ్ల శ్రీనివాస్,కోన్ రెడ్డి వెంకటరెడ్డి,మట్టపల్లి వెంకటేశ్వర్లు,ధరవత్ మంగ, జిల్లా నగేష్,మర్రి పద్మ,రవి,తదితరులు పాల్గొన్నారు.

పెద్దులు మృతి సీపీఐ(ఎం)కు తీరని లోటు

- మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి

నవ తెలంగాణ -నార్కట్ పల్లి



మండలంలో చిన్న నారాయణపురం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మెరుగు పెద్దులు మృతి పార్టీకి తీరని లోటని మాజీ శాసనసభ్యులు నంద్యాల నరసింహారెడ్డి పేర్కొన్నారు. మెరుగు పెద్దులు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం పెద్దులు స్వగృహంలో భౌతికకాయాన్ని జూలకంటి సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రాగడ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దులు చిన్నతనం నుంచే కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితుడై గత 40 సంవత్సరాల నుంచి పార్టీ సభ్యునిగా పార్టీ పట్ల పార్టీ నిబంధనల ప్రకారం పని చేసే వారిని గుర్తు చేశారు. గతంలో సింగిల్ విండో డైరెక్టర్ గా పోటీ చేసి అతి స్వల్ప తేడాతో ఓడిపోయారని అన్నారు పెద్దులు మృతి పార్టీకి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని అన్నారు. నివాళులర్పించిన వారిలో మండల కార్యదర్శి చింతపల్లి బయన్న, మాజీ మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి,కొప్పు శ్రవణ్,దండు రవి ఉన్నారు.

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యడమ సుమతమ్మ

నవతెలంగాణ - నాంపల్లి

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు యడమ సుమతమ్మ బుదవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అంగన్వాడి టీచర్లకు, హెల్పర్లకు వచ్చే చాలీచాలని వేతనాలతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం వచ్చిన బతుకులు మారవు అని ఒక్కొక్క టీచర్ ఆయాలు భయం తో తనువులు చాలిస్తున్నారని పేర్కొన్నారు. మెనూ చార్జీలు పెంచి ప్రతినెల వేతనాలు ఇవ్వాలని, అంగన్వాడి సెంటర్లకు ఇచ్చే సరుకులు, నాణ్యమైన కోడిగుడ్లు అంగన్వాడి సెంటర్లలో ఫుడ్ గ్యాప్ లేకుండా ఫుడ్ అందించాలన్నారు. గత ఆరు నెలల క్రితం రిటైర్డ్ అయిన టీచర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ 2 లక్షల రూపాయలు ఆయాలకు 1 లక్ష రూపాయలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. ఫోన్స్ పనిచేయడం లేదని టాబ్స్ వచ్చేవరకు టీచర్ల మీద ఒత్తిడి తీసుకురావద్దని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ శాంతకుమారి, యాదమ్మ, స్వరాజ్యం, విజయ ప్రసన్న ఇందిరా సరస్వతి స్వప్న కవిత ఉన్నారు.

రహదారి అభివృద్ధి పనులు కొనసాగించాలి

నవతెలంగాణ- మిర్యాలగూడరూరల్

పట్టణంలో సత్వరమే భూసేకరణ ప్రక్రియచేపట్టి రహదారి అభివృద్ధి పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డీసీసీ జనరల్ సెక్రెటరీ కె.ఓంప్రకాష్ అన్నారు. బుధవారం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు .2022లో పట్టణంలో రోడ్ల వెడల్పు చేయడానికి జాతీయ రహదారులు న్యూఢిల్లీ వారి ద్వారా రూ.124 కోట్లు మంజూరు కాగా అందులో 75 కోట్లు భూసేకరణ, ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడానికి కేటాయించడం జరిగిందన్నారు. అప్పుడు పనుల్లో ఆలస్యం జరగడం వల్ల నిలిచిపోయాయన్నారు. భూసేకరణ ప్రక్రియ మొదలై కూడా సుమారు రెండు సంవత్సరాలు పూర్తికావచ్చిందని ఇంకా భూసేకరణ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. జాతీయ రహదారులు న్యూఢిల్లీ వారి నిబంధనల ప్రకారం భూసేకరణ ప్రక్రియ పూర్తికాకపోయినా, కోర్టు కేసులు ఉన్నట్లయితే మంజూరైన నిధులు తిరిగి వెనక్కి తీసుకొని అనుమతులు రద్దు చేసే అవకాశం ఉందని ఉన్నారు. ఈనెల 31 వరకు నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉన్నందున అధికారులు చర్యలు తీసుకొని పట్టణంలో రహదారి అభివృద్ధి కొనసాగేలా చూడాలన్నారు.

సతమ్మకు నివాళులు

నవతెలంగాణ -చిట్యాల

మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన మాజీ దేవస్థానం డైరెక్టర్ ఆరూరి తిరుమలయ్య తల్లి ఆరూరి సత్తెమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని మాజీ మార్కెట్ చైర్మన్ కాటం వెంకటేశం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కందిమల్ల శశి పాల్ రెడ్డి, చిన్న మల్లయ్య, బాలగోని రాజు, రాచమల్ల జానయ్య, నాగం కిషోర్ ,నూతి వెంకన్న, తెల్సూరి సైదులు ,గంటల పుల్లారెడ్డి ,నీలకంఠం లింగస్వామి, ఆరూరి శీను తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి పరామర్శ

నవ తెలంగాణ -నకిరేకల్

నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ఎలుగురి వెంకన్న అనారోగ్యంతో మృతిచెందగా నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కట్టంగూర్ మాజీ ఎంపీపీ రెడ్డిపల్లి సాగర్ సోదరుడు సైదులు సతీమణి అనారోగ్యంతో మృతిచెందగా వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



మందడి బుగ్గారెడ్డికి నివాళి

నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన మందడి నరేందర్ రెడ్డి తండ్రి రిటైర్డ్ టీచర్ మందడి బుగ్గారెడ్డి ఇటీవల మృతి చెందారు.బుధవారం ఆయన దశదినకర్మ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగం గౌడ్ బుగ్గారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు అయితగోని యాదగిరి గౌడ్,అనంతుల వెంకటేష్ గౌడ్,రఘు గౌడ్,సాయినాథ్ రెడ్డి,రఘుమారెడ్డి పాల్గొన్నారు..

ఎడమ కాలువ టన్నెల్ వద్ద మట్టిని పరిశీలించిన తహసీల్దార్, ఎస్సై

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ -పెద్దవూర



నవతెలంగాణ లో ఈ నెల 17న ప్రచురితమైన కాలువమట్టి.. కాసుల వర్షం కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం తహసీల్దార్ సరోజ పావని, ఎస్సై వీరబాబు చలకుర్తి ఎడమ కాలువ టన్నెల్ పక్కన తవ్వి తరలించన మట్టి ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎడమ కాలువలు వర్క్ ఇన్‌స్పెక్టర్ రమావత్ యాలు నాయక్‌కు ఫోన్ చేసి సమాచారం సేకరించారు. మట్టి పది రోజుల క్రితమే అక్కడి నుంచి తరలిచి నట్లు చెప్పారని తెలిపారు. నిన్న మొన్న మట్టి ఇక్కడి నుంచి ఎవరు తోలలేదని తెలిపినట్లు చెప్పారు.అప్పుడే వారిని మరోసారి మట్టి తవ్వితే కేసు నమోదు చేస్తామని వారితో వర్క్ ఇన్‌స్పెక్టర్ తెలిపారని అన్నారు.మట్టిని తరలించిన వారిని తెలుసుకొని కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ సరోజ పావని, ఎస్సై వీరబాబు తెలిపారు.

నిర్లక్ష్యపు నీడలో శిల్పాలు

- పురావస్తు పరిశోధకుడు డా. ఈమని శివనాగిరెడ్డి

నవతెలంగాణ- నాగర్జునసాగర్



నాగార్జునసాగర్ కృష్ణానది తీరాన హిల్ కాలనీలో బస్టాండ్ కి వెళ్లే దారిలో గల శ్రీదేవి భూదేవి సమేత ఏలేశ్వర మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో కాకతీయుల కాలపు శిల్పకళాఖండాలు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని, వాటిని భద్రపరిచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా, సీఈవో, డా. ఈమని శివనాగిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నాగార్జునసాగర్ లో మాట్లాడుతూ ఏలేశ్వర స్వామి ఆలయం వెనక 700 సంవత్సరాల నాటి భిన్నమైన నంది, ఆలయ ద్వారశాఖలు, విడిభాగాలు, ఇంకా రెండు సహస్ర లింగాలున్నాయని, వాటిని ప్రాంగణంలోనే పీఠాలపై నిలబెట్టి, చారిత్రక వివరాలతో పేరు పలకలను(లేబుల్) ఏర్పాటు చేస్తే, భక్తులు, పర్యాటకులు వాటి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది అన్నారు.1954-60 మధ్యకాలంలో నాగార్జునసాగర్ జలాశయ నీటి ముంపు ప్రాంతమైన ఏలేశ్వరం నుంచి వీటిని తరలించి ఇక్కడికి చేర్చారని, గత 65 ఏళ్లుగా ఇవి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయని, చారిత్రక ప్రాధాన్యత గల ఈ 13వ శతాబ్ది కళాఖండాలను భద్రపరిచి, భావితరాలకు అందించాలని ఆలయ అధికారులకు, నందికొండ మున్సిపాలిటీ వాసులను శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

రాజకీయ కక్షతోనే నా భూమి పెన్సింగ్ కూల్చారు

- రాయపూడి భవానీ

నవతెలంగాణ-మిర్యాలగూడ



రాజకీయ కక్షతోనే తన భూమి ఫెన్సింగ్ కూల్చారని, తన భూమిలోకి వెళ్లేందుకు గేటు పెట్టుకునేందుకు దారే ఇచ్చి న్యాయం చేయాలని బాధితురాలు రాయపూడి భవాని కోరారు. బుధవారం తన భూమి వద్ద విలేకర్ల తో మాట్లాడారు. తాను 2012లో 711/ఆ ముప్పా అవినాష్ దగ్గర 22 గుంటల భూమిని కొనుగోలు చేశామని, దీనికి మున్సిపాలిటీ అనుమతి, ఎల్ఆర్ఎస్ ఉందని తెలిపారు. 4ఏండ్ల క్రితం భూమికి ఫినిషింగ్ ఏర్పాటు చేసి గేటు పెట్టుకున్నమని ఇప్పుడు రెవెన్యూ అధికారులు వచ్చి 626 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమి ఉందని సాకు చూపి కనీసం మాకు సమాచారం ఇవ్వకుండా మా అనుమతి లేకుండా మా ఫెన్సింగ్ కూల్చివేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూమి ఉందని నిర్ధారిస్తే స్వచ్ఛందంగా తాము తప్పుకుంటామని చెప్పినప్పటికీ కావాలని ఫెన్సింగ్‌ను కూల్చారని దానివల్ల 6 లక్షల వరకు నష్టం వాటిల్లదని వాపోయారు. మాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు మాకు తెలిసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గేటు పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 3 అడుగుల ప్రభుత్వ భూమి ఉన్నదని చూపి బోర్డు ఏర్పాటు చేశారని, దానిని వెంటనే తొలగించాలన్నారు. ఈ సమావేశంలో రాయపూడి ఉమ శేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో కల్మల్ చెరువు వాసి గుండెపోటుతో మృతి



నవతెలంగాణ-గరిడేపల్లి

మండలంలోని కల్మల్ చెరువు గ్రామానికి చెందిన తుమ్మ కుమ్ము సైదులు(60) అనే వ్యక్తి బుధవారం సాయంత్రం తిరుపతిలో గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం దైవ దర్శనం కోసం వెళ్లిన సైదులు తిరుగు ప్రయాణంలో తిరుపతి రైల్వే స్టేషన్లో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా గుండె నొప్పి వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు తిరుపతి రైల్వే పోలీసులు గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించగా ఈ విషయాన్ని మృతుడి కుటుంబానికి స్థానిక పోలీసులు సమాచారాన్ని అందించారు. చనిపోయిన సైదులు వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంతో రైల్వే పోలీసులు సమాచారాన్ని అందించగలిగారు. సైదులుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. తిరుపతి నుంచి మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు కల్మల్ చెరువు మాజీ సర్పంచ్ మూలగుండ్ల విజయ సీతారామరెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.

పాఠశాలలకు డుమ్మా కొట్టి సేవా కార్యక్రమాలా ?

- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అలక సరిత

నవతెలంగాణ-నేరేడుచర్ల

మండలంలోని పలువురు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాఠశాలలకు డుమ్మాకొట్టి సేవా కార్యక్రమాలు నిర్వహించారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అలక సరిత అన్నారు. బుధవారం ఆమె నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో పాటు ఉన్నతాధికారులవద్ద అనుమతి పొందకుండానే పాఠశాలలకు ఎగనామం పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నేరేడుచర్ల మండలంలోని పలువురు ఉపాధ్యాయులు స్వచ్ఛంద సంస్థలలో చేరి ప్రతినిత్యం పాఠశాలలకు వెళ్లకుండా దాతల వద్ద విరాళాలు సేకరిస్తున్నారన్నారు. సెలవుల్లో కాకుండా వీరు పాఠశాలలకు డుమ్మా కొట్టి కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు లక్షల్లో జీతాలు తీసుకుంటూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పకుండా పాఠశాలకు రాకుండా ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడం ఏంటన్నది పలువురి విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారన్నారు.

అర్హులకు దక్కేనా ?



- ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ
- దరఖాస్తులు వేలల్లో.. కేటాయింపులు వందలల్లో
- ఈనెల 25న సర్వే పూర్తి చేయాలని ఆదేశం

నవతెలంగాణ-ఆత్మకూరు(ఎస్)

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలైన 6 గ్యారంటీలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒకటి. ఇప్పటివరకు కొన్ని హామీలు అమలు అవుతుండగా తాజాగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటికే కిందటి ఏడాది డిసెంబర్ చివరివారం నుంచి జనవరి మొదటి వరకు దరఖాస్తులు స్వీకరించగా వాటిని ప్రస్తుతం పరిశీలన చేపడుతున్నారు. అప్పట్లో ఇండ్ల కోసం మండల వ్యాప్తంగా వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. ఆత్మకూరు(ఎస్) మండలంలో 15,315 మంది దరఖాస్తులు చేశారు. ప్రస్తుతం 1272 ఇండ్లలో సర్వే పూర్తి అయ్యింది.

కానీ ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున కేటాయించగా మండలానికి వందల సంఖ్యలో మాత్రమే మంజూరు చేస్తుంది. దరఖాస్తులు వేలల్లో రాగా ఇండ్ల కేటాయింపు మాత్రం వందలలో ఉండడంతో ఇవి ఎవరికి దక్కుతాయోనని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వాస్తవానికి గత పదేళ్లగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేయలేదు. దీంతో వేలాదిగా ఉమ్మడి కుటుంబాల నుంచి జంటలు విడిపోయి వేరువేరుగా జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఇలాంటి వారు అనేకమంది అద్దె ఇంట్లో ఉంటూ, కొంత మంది గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. ప్రభుత్వం ఎప్పుడు ఇండ్లు మంజూరు చేస్తుందా తమకు ఎప్పుడు సొంతిల్లు లభిస్తుందోనని ఆత్రుతగా ఎదురు చూశారు. కానీ ప్రస్తుతం వచ్చిన దరఖాస్తులు చూస్తే తమకు దక్కుతుందో లేదో అనే ఆందోళన గురవుతున్నారు.

ఒక్కో గ్రామంలో వందల కుటుంబాలు..

ప్రభుత్వం ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో పొందుపరిచిన దరఖాస్తు ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికి వెళ్లి అర్హుల ఎంపిక ప్రక్రియ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఆయా అర్హులైన లబ్ధిదారుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇల్లు లేదంటే స్థలం వద్ద లబ్ధిదారుల ఫోటోలు తీసి ఇంటి నెంబర్లు, రేషన్ కార్డు వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో అనేక గ్రామాల్లో అర్హులు సైతం వందల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తుంది. వీరు లబ్ధిదారులను ఎంపిక చేసిన తర్వాత చివరి ఎంపిక కోసం సంబంధిత శాఖకు జాబితా పంపనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. దీని ప్రకారం గ్రామాలలో యూనిట్‌గా తీసుకొని లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం ఇండ్ల కేటాయింపుల తొలి ప్రాధాన్యంగా బీపీఎల్ కుటుంబమై ఉండడంతో పాటు సొంత స్థలం కలిగి ఉండాలి. నిరుపేదలై ఉండి దళిత, గిరిజన కుటుంబాలతో పాటు ఒంటరి మహిళ, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు ప్రాధాన్యత ఇవ్వనుంది. కానీ ఒక గ్రామంలో సుమారు వెయ్యి జనాభా ఉంటే ఇందులో సుమారు 700 వరకు కుటుంబాలు బీపీఎల్ పరిధిలో ఉన్నాయి. అనేకమంది ఇండ్లు లేని వారు ఉన్నారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ లోను సొంత స్థలం కలిగి ఉన్నప్పటికీ అనేకమంది సొంతింటి నిర్మాణానికి నోచుకోని వారు ఉన్నారు. ఈ క్రమంలో ఎవరిని తొలి ప్రాధాన్యతగా తీసుకుంటారోనని సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఇందులో రాజకీయాల జోక్యం ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధన ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక: ఎంపీడీవో హసీం

మండలంలోని ఇందిర ఇండ్ల కేటాయింపులకు అర్హుల ఎంపిక కోసం మండలంలోని 30 గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. అర్హుల వివరాలు పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఐకెపి సీసీలు సర్వే చేసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారమే తొలివిడత లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి



నవ తెలంగాణ-మద్దిరాల

గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లపై జరుగుతున్న విచారణ పారదర్శకంగా ఉండాలని, అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కల్లేపల్లి భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్వం నుండి గ్రామాలలో ఉంటున్న పేదలకు ఇళ్ల స్థలాలకు సంబంధించి కాగితాలు లేకపోయినా వాటిని పరిగణలోకి తీసుకోకుండా ఇల్లు కేటాయించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విధంగా పెంకుటిల్లు, రేకులతో నిర్మించిన ఇళ్లకు కూడా స్లాబ్ వేసేందుకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించినదని అన్నారు. 2 లక్షలకు పైబడిన రైతులకు రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతాంగానికి వెంటనే రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీరామ్‌సాగర్ నీరు విడుదల చేసి రైతుల పంటలకు నీళ్లు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసాను సంక్రాంతి తర్వాత ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలన్నారు. మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఇచ్చే 2500 రూపాయలను కూడా వెంటనే ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధరణి ద్వారా అప్లై చేసుకున్న ప్రజల దరఖాస్తులకు వెంటనే మోక్షం కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి, పార్టీ మండల కార్యదర్శి పోలోజు సైదులు, మండల నాయకులు దీకొండ రంగయ్య, పాతూరి మల్లారెడ్డి, బద్దం మల్లారెడ్డి, బొబ్బిలి మీనయ్య పెరుమాళ్ళ మోష,చిదిరాల నారాయణ, ఆకుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన, విహారయాత్రలో కేజీవీబీ విద్యార్థులు

నవతెలంగాణ-సూర్యాపేట రూరల్



తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట మండలం ఇమాంపేట కేజీవిబీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం విజ్ఞాన, విహారయాత్రకు బయలుదేరారు.యాత్రలో బాగంగా రామప్ప దేవాలయం, లక్నవరం, భద్రకాళీ దేవాలయం, వేయి స్తంభాల దేవాలయలను సందర్శించనున్నారు. నాలుగు బస్సులలో యాత్రకు బయలుదేరిన 200 మంది విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు స్నాక్స్, టిఫిన్లు, భోజన సౌకర్యం పటేల్ రమేష్ రెడ్డి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల విజ్ఞాన, విహార యాత్రకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అండర్-19 ఉమెన్స్ క్రికెట్ జట్టుకు శ్రీవాణి ఎంపిక



నవతెలంగాణ-చిలుకూరు

అండర్-19 ఉమెన్స్ క్రికెట్ జట్టుకు తాను ఎంపికైనట్లుగా బుధవారం మండల కేంద్రంలో శ్రీవాణి విలేకరులతో తెలిపారు. వన్డే ఉమెన్స్ క్రికెట్ పోటీలకు హైదరాబాద్ టీం తరఫున మండలంలోని కొత్త కొండాపురం గ్రామానికి చెందిన శ్రీరామ్ శ్రీ వాణి ఎంపిక చేశారన్నారు. 2025 జనవరి నెలలో కేరళ రాష్ట్రంలో ఐదు రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్నందున హైదరాబాద్ జట్టు నుండి ఎంపిక చేశారని తెలిపారు. ప్రస్తుతం శ్రీవాణి ఇంటర్ సెకండియర్ హైదరాబాదులో చదువుతున్నానున్నారు శ్రీవాణి ఎంపిక పట్ల బంధువులు గ్రామస్తులు మండల స్థాయిలో ఉన్న పార్టీల నాయకులు అందరూ అభినందించారు.

రూ.1200 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి ఘనత సామేలుదే

కాంగ్రెస్ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు

నవతెలంగాణ-నూతనకల్



తుంగతుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యునిగా ఎన్నికైన ఏడాది పాలనలోనే రూ.12 వందల కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మందుల సామెల్‌కే దక్కిందని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తిరుమలగిరి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు. తొండ, పాటిమట్ల గ్రామలలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణం, తాటిపాములలో శివారులో 6 చెక్ డ్యాములకు 21 కోట్ల నిధులు కేటాయింపు, అదే గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. మోత్కూరు మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ డిపో ఏర్పాటు, రెవిన్యూ డివిజన్, మున్సిపల్ కోర్ట్ బిక్కనీరు వాగు పై నూతన బ్రిడ్జి కొరకు ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. తిమ్మాపురం నుండి నూతనకల్ మండల కేంద్రం వరకు రోడ్డు నిర్మాణం కోసం 32 కోట్ల మంజూరు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరుగు కిరణ్ నాయకపు, మల్లేష్ ఇరుగు మల్లేష్ కొమ్ము సురేష్ నాయకపు నాగరాజు నాయకపు నవీన్ నాయకపు రాజు ఇరుగు లింగరాజు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ మండల అధ్యక్షునిగా నరేష్ గౌడ్

నవతెలంగాణ-గరిడేపల్లి

కబడ్డీ అసోసియేషన్ గరిడేపల్లి మండల అధ్యక్షులుగా గుండు నరేష్ గౌడ్, ఉపాధ్యక్షులుగా కుక్కడపు లక్ష్మయ్య ఎన్నికయ్యారు. సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా కబడ్డీ అసోసియేషన్ అడ్ హక్ కమిటీ చైర్మెన్ రామనేని భూలోకరావు, కన్వీనర్ కర్తయ్య పర్యవేక్షణలో బుధవారం గరిడేపల్లి మండల నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన నరేష్ గౌడ్, లక్ష్మయ్యలు మాట్లాడుతూ కమిటీ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లాలో కబడ్డీ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అంతేకాక జిల్లా వ్యాప్తంగా కబడ్డీ పోటీలను నిర్వహించే విధంగా స్థానిక సంస్థలకు గ్రామస్తులకు క్రీడాకారులకు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ ఎన్నికకు కృషిచేసిన చైర్మన్ భూలోకరావు, కన్వీనర్ కర్తయ్య లకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాయినిగూడెం గ్రామానికి చెందిన నరేష్ ఎంపిక కావడం పట్ల మాజీ ఎంపీటీసీ సందీప్ హర్షం వ్యక్తం చేశారు.

పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి



- 2025 ఫిబ్రవరి 2న దిష్టిపూజ, 16 నుంచి 20 వరకు జాతర
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నవతెలంగాణ-చివ్వెంల

తెలంగాణలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన పెద్దగట్టు శ్రీ లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం లింగమంతుల స్వామి దేవాలయాన్ని ఆదనపు కలెక్టర్ పి.రాంబాబు, అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2025 ఫిబ్రవరి 2న దిష్టిపూజ నిర్వహిస్తారని, ఫిబ్రవరి 16 నుంచి 20వరకు జాతర జరుగుతుందని వెల్లడించారు. జాతర ఏర్పాట్ల కొరకు ప్రతి కార్యక్రమానికి ఒక ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలని, అధికారులు జాతర సజావుగా నిర్వహించడానికి కావలసిన పనుల అంచనా విలువలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. జాతర జరుగు అన్ని ప్రాంతాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ఉండాలని, పర్యవేక్షణకు ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్ గుడి పైన క్రింద ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని ప్రాంతాలను కవర్ చేస్తూ పబ్లిక్ ఎటస్టెషన్ సిస్టం ఏర్పాటు చేయాలని చెప్పారు. జాతరలో పనిచేసే సిబ్బంది అందరికీ పాసులు ఉండాలని తెలిపారు. వాలంటీర్స్ అందరికీ పోలీస్ అప్రూవల్ కార్డ్స్ ఉండాలన్నారు. దేవాలయం వద్ద ప్రోటోకాల్ కొరకు ఒక అధికారిని నియమించాలని తెలిపారు. గుడి పైన ఏర్పాట్లను దేవాదాయ శాఖ ,గుడి కింద ప్రాంతాలను మున్సిపల్ అధికారులు ఏర్పట్లు పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు ఆర్ అండ్ బి అధికారులు గుడి పక్కన గల కోనేరుకు, గుడి చుట్టూ ఉన్న రహదారులకు బారికేట్స్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దేవాలయం పైన జాతర చుట్టుపక్కల



రహదారులకు సుందరీకరణ చేయాలని, కోనేరు వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జాతర జరుగు సమయంలో ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుటకు పారిశుధ్య కార్మికులు పైన దేవాదాయ శాఖ వారు, గుడికి క్రింద మున్సిపల్, ఎంపీడీవోలు చూడాలన్నారు. దేవాలయానికి, పరిసర ప్రాంతానికి రంగులు వేయాలని అలాగే గుడి పైన జాతర గుర్తుగా బెలూన్ ప్రదర్శించాలన్నారు. జాతర విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ భాష, డిఎస్పి రవి, ఈవో కుశలయ్య, ఆలయ పూజారులు శ్రీశైలం , శ్రీను ,తహసిల్దార్ కృష్ణయ్య, ఆర్ఐ శ్రీధర్, మిషన్ భగీరథ అధికారులు ఇంట్రా శ్రీనివాస్ , గ్రిడ్ అధికారి అరుణాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులను రద్దు చేసేంత వరకు ఐక్య ఉద్యమాలు

- ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపు



నవతెలంగాణ-ఆత్మకూరు(ఎస్)

ఎస్ఎంకే ఇథనాల్ కంపెనీకి ఇచ్చిన అనుమతులను రద్దు అయ్యేంతవరకు ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఐక్యంగా ఉద్యమాలు ఉధృతంగా నిర్మిస్తామని నాయకులు పిలుపునిచ్చాయి. బుధవారం ఆత్మకూర్(ఎస్) మండలం శెట్టి గూడెం గ్రామంలో ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ గ్రామ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సందర్భంగా ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ మోతె మండలం రావి పహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఎస్ఎంకె ఇథనాల్ కంపెనీ పనులు పూర్తి అయితే చుట్టు పక్కన గ్రామాల్లో ఇథనాల్ కంపెనీ కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఈ ఫ్యాక్టరీ కాలుష్యం మూలంగా రైతుల పంటలు పూర్తిగా నాశనం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తక్షణమే అధికార ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఇథనాల్ కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా 14 మందితో ఎస్ఎంకె ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా నాయకులు మండారి డేవిడ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా నాయకులు మట్టిపల్లి సైదులు, నారబోయిన వెంకట్ యాదవ్, ఆవుల నాగరాజు యాదవ్, నల్లెడ మాధవరెడ్డి, చామకూరి నరసయ్య, గంట నాగయ్య, కునుకుంట్ల సైదులు, కాకి సురేందర్ రెడ్డి, కాంపాటి దిలీప్, కాకి నారాయణ రెడ్డి, పందిళ్ళపల్లి మల్లారావు, శెట్టి గూడెం గ్రామ నాయకులు పానుగంటి మల్లారెడ్డి, పాపిరెడ్డి, ఉపేందర్ రెడ్డి, పరమేష్, ఉపేందర్, శంకర్, నాగబాబు, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

వర్గీకరణ అమలుకు మరోఉద్యమానికి సిద్ధం

- ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతాబాబు మాదిగ



నవతెలంగాణ-కోదాడ టౌన్

ఎస్సీ వర్గీకరణ అమలుకు మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ దక్షిణా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతా బాబు మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లెటి లక్ష్మణ్ మాదిగలు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో ఈనెల 13 నుంచి కోదాడ నియోజకవర్గంలో మాదిగలను చైతన్యపరిచేందుకు చేపట్టిన బైక్ ర్యాలీ ముగింపు సందర్భంగా పట్టణంలో అంబేద్కర్ కాలనీ నుండి భారీ ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. వర్గీకరణ చేసిన తర్వాతనేఉద్యోగ నియామకాలు చేపట్టాలనిప్రస్తుతం శాసనసభ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 19న జరిగే మాదిగల గర్జన సభకు గ్రామస్థాయి నుండి మాదిగలంతా ఐక్యమై తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గ ఇన్చార్జ్ బాణాల అబ్రహం,పట్టణ అధ్యక్షులు ఏర్పుల చిన్ని మాదిగ, కౌన్సిలర్ గంధం యాదగిరి, కంభంపాటి శ్రీను, గంధం పాండు, రంగయ్య, పిడమర్తి బాబురావు, ఏర్పుల శ్రావణ్,విజయభాస్కర్, ముక్కంటి, వెంకటనారాయణ, కందుకూరి నాగేశ్వరరావు, స్వామి, ప్రసాద్, కొత్తపల్లి నరహరి, పంది వెంకటి,వినయ్, చంటి పాల్గొన్నారు.

డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-కోదాడ రూరల్

అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలోని బస్టాండ్ సెంటర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సూర్య డయాగ్నస్టిక్స్ కేంద్రాన్ని టీపీసీసీ డెలిగేట్స్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా లక్ష్మి నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేసిన డయాగ్నస్టిక్ సెంటర్ ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ పట్టణ యువత అధ్యక్షులు డేగ శ్రీధర్, కోదాడ మత్స్యశాఖ చైర్మన్ వీరాస్వామి,మాజీ ఎంపీటీసీ అంబటికర్ర శ్రీను,అహ్మదాబాద్ మాజీ సర్పంచులు ముత్తినేని కోటేశ్వరరావు, చిలకమూడి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను రద్దు చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి



నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్

విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు కారణమౌవుతున్న నారాయణ విద్యాసంస్థలను రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విచ్చలవిడిగా ఏర్పాటు అయిన కార్పొరేట్ నారాయణ విద్యాసంస్థల దోపిడీ వ్యవహారం పేద, మధ్య తరగతి విద్యార్థులే లక్ష్యంగా చేసుకొని వారి వద్ద లక్షల రూపాయలు దండుకుంటునాయని అన్నారు. ఇలాంటి కార్పొరేట్ వ్యవస్థలు ఆర్థికంగ, మానసికంగ విద్యార్థులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి అని ఆవేదన వ్యయక్తం చేశారు. ఉజ్వల భవిష్యత్ ఉండాల్సిన నవయవ్వన బాల మొగ్గలని, ర్యాంకుల పేరిట ఒత్తిడికి గురిచేసి ఆత్మహత్యలకు పాల్పడేలా ప్రేరేపిస్తున్నాయన్నారు. ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులు చనిపోతున్నారని అయినా కూడా ఈ ప్రభుత్వం ఈ విద్యాసంస్థలు వేసే కుక్క బిస్కెట్ల మీద ఆశపడి, ఆధారపడడం వలన వీటి మీద నియంత్రణ కరువైంది అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలలో ఫీజులు నియంత్రించేందుకు ఫీజుల నియంత్రణ కమిటీ లేదా చట్టాన్ని తీసుకొచ్చి సంస్థల అన్నిటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నారాయణ విద్యా సంస్థలను రద్దు చేయాలని అలాగే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని నారాయణ, దోపిడి విద్యా సంస్థల నిర్వాహకులు నిబంధలకు విరుద్ధంగా సెలవు రోజు కూడా ప్రత్యేక తరగతులు కొనసాగిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు అని తెలిపారు.దీనిపైన తక్షణమే జిల్లా విద్య ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విషయంపై బాలల హక్కుల సంఘం కూడా జోక్యం చేసుకొని విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మహేష్. నవీన్, పవన్, వినయ్, ప్రవీణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త శక్తితో రానున్న దామన్న !

- విరుద్ధ ప్రచారాలకు చెక్
- 15 ఏండ్ల కిందటి దామన్నను చూడబోతున్నారు, కార్యకర్తలు అధైర్యపడొద్దు: కొప్పుల వేణారెడ్డి
- రేపు సూర్యాపేటకు రాంరెడ్డి దామోదర్ రెడ్డి రాక

నవతెలంగాణ-సూర్యాపేట


తెలంగాణ రాజకీయాల్లో కీలక నేతగా, ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి (దామన్న) అనారోగ్యాన్ని



జయించి తిరిగి సూర్యాపేటకు రాబోతున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో విశ్రాంతి తీసుకుంటున్నప్పటికీ, ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల ముందుకు రానుండడంతో రాజకీయ వర్గాలతో పాటు కార్యకర్తల్లో ఆనందాన్ని నింపుతోంది. ఆయన ఆరోగ్యం గురించి వచ్చే ప్రతి చిన్న వార్త పైనా కార్యకర్తలు స్పూర్తి పొందుతూ ఎదురు చూసారు. అయితే ఇటీవల కొందరు విరుద్ధ శక్తులు దామన్నకు సంబంధించిన అసత్య సమాచారం ప్రచారం చేస్తుండటంతో ఆయన అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఇదే సమయంలో కొందరు విరోధులు అనేక రకాల దుష్ప్రచారాలు కూడా చేశారు.

సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల ముందుకు..

తాజాగా దామన్న తన ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా అధిగమించి, వైద్యుల పర్యవేక్షణలో పూర్తిగా కోలుకున్నారు. తాను త్వరలోనే సూర్యాపేటకు వచ్చి ప్రజలను, కార్యకర్తలను కలుస్తానని వీడియో కాల్‌తో పాటు ఇంకా హైదరాబాద్‌లోని తన నివాసంలో కలుస్తున్న వారితో స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రకటనతో ఆయన శ్రేణులు పెద్ద ఊరట చెందాయి. దామన్న తన అత్యుత్తమ కాలంలో ప్రత్యర్థులకు గట్టి పోటీని ఇచ్చిన విధానం ప్రజల గుండెల్లో ఉంది. ఆయన ప్రజాసేవను, సమస్యల పరిష్కారాన్ని ఉత్సాహపూరితంగా నిర్వహించారు. ఇప్పుడు కూడా అదే శక్తితో, కొత్త ఉత్సాహంతో సంపూర్ణ ఆరోగ్య వంతుడిగా రానున్నారు. ఇది కేవలం దామన్నకు సంబంధించి కాకుండా, ఆయనతో పనిచేసే కార్యకర్తల దిశగా ఉత్సాహాన్ని పెంపొందించగలదని విశ్లేషకులు భావిస్తున్నారు.



కార్యకర్తలలో కొత్త ఉత్సాహం..

దామన్న ఆరోగ్య వార్తతో ఆయన శ్రేణులలో కొత్త ఉత్సాహం నిండింది. ముఖ్యంగా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల కార్యకర్తలు ఆయనను కలిసి మరింత బలమైన నడతతో ముందుకు సాగాలని ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నేతలు మాట్లాడుతూ "దామన్న అనారోగ్యాన్ని జయించి మరింత ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. ఇది పార్టీకి ఒక సానుకూల సంకేతం' అని వ్యాఖ్యానించారు. పూర్తిగా కోలుకుని ప్రజలను, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలవబోతున్న వార్త జిల్లాలో సానుకూల వాతావరణాన్ని కల్పించింది.

15 ఏండ్ల కిందటి దామన్నను చూడబోతున్నారు.. కార్యకర్తలకు ధైర్యం నింపిన సీనియర్ నాయకుడు కొప్పుల వేనారెడ్డి

సీనియర్ నేత కొప్పుల వేనారెడ్డి దామన్నకి దగ్గరైన నాయకుడు. ఆపత్కాల సమయానికి ఆయన కీలకంగా దామన్నకు వెన్నుముకగా కనిపిస్తారు. ఇటీవలే స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపుతూ "మన నాయకుడు రాబోతున్నారు. మీకు అవసరమైన మార్గదర్శకత్వం మరలా



అందించబడుతుంది' అంటూ ఆయన ఉత్సాహ భరితమైన ప్రసంగాన్ని చేశారు. ఈ సందేశం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని కలిగించింది. దుష్ప్రచారాలను నమ్మకండి దామన్న ఆరోగ్యం పై వస్తున్న వార్తలను ఆయన ఖండిస్తూ 'ఈ వదంతులు అవాస్తవాలు.. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలో మీ ముందుకు వస్తున్నారని' స్పష్టం చేశారు. 15 సంవత్సరాల కిందటి దామన్నను మళ్లీ చూడబోతున్నామని వేనారెడ్డి చేసిన వ్యాఖ్యలు కార్యకర్తలలో మరింత ఉత్సాహాన్ని నింపాయి. ఆయన మాటలు కార్యకర్తలకు ప్రేరణ కలిగించాయి. దీంతో కార్యకర్తలు, అభిమానులు టైగర్ ఇజ్ బ్యాక్.. బాస్ ఇజ్ బ్యాక్ అంటూ షోషల్ మీడియాలో దామన్న ఫోటోలను వైరల్ చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దామన్న ఈనెల 20 వ తేదీన సూర్యాపేటకు రానున్నారని బలంగా ప్రచారం జరుగుతోంది. ఆయన సూర్యాపేట ప్రజలను కలవబోతున్న వార్త పార్టీ శ్రేణుల్లో నూతన శక్తి, భరోసాను నింపుతుందని చెప్పవచ్చు.

మృతుని కుటుంబానికి బీమాచెక్కులు అందజేత

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి



పోచంపల్లి కోఆపరేటివ్‌అర్బన్ బ్యాంకులో ఖాతా, వాటాదారుడై న.కె. వెంకటేశం ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందినందున, వారి కుటుంబ సభ్యులకు బ్యాంకు తరపున చైర్మెన్ తడక రమేష్ బుధవారం బీమా చెక్కులను అందజేశారు.న్యూ ఇండియా ఇన్సూరెన్స్ సౌజన్యంతో రూ.1.25 లక్షల మరో చెక్కు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఈవో సీత శ్రీనివాస్, మేనేజర్లు మధుసూదన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థినుల బృందం సందర్శన

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

యూఆర్ఎక్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ విద్యార్థినుల బృందం ఫ్యాషన్ పరిశ్రమలు విభిన్న అంశాలను పరిశీలించడానికి బుధవారం భూదాన్ పోచంపల్లిని సందర్శించింది.ఈ సందర్భంగా స్థానిక కళాపునర్వి హ్యాండ్లూమ్స్‌ను సందర్శించారు. స్థానిక గ్రామీణ పర్యాటక కేంద్రంలో చేనేత కార్మికుడు మగ్గం నేయడాన్ని, చిటికీలు కట్టడాన్ని, ఫొటోలను, చేనేత వస్త్రాలను పరిశీలించారు.ఈ బృందం వెంట ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఊర్వసి ,సోని ఉన్నారు.



తెలంగాణ జన సమితి మండలఅధ్యక్షునిగా గడ్డం యాదగిరి

నవతెలంగాణ-రామన్నపేట



తెలంగాణ జన సమితి మండల అధ్యక్షునిగా రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన గడ్డం యాదగిరిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గడ్డం యాదగిరి బుధవారం విలేకర్లతో మాట్లాడారు.ఇటీవల పార్టీలో చేరిన నాకు నమ్మకంతో టీజేఎస్ మండల అధ్యక్షునిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. మండలంలో పార్టీ పటిష్టతకు పని చేస్తానన్నారు.తన నియా మకానికి సహకరించిన టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, జిల్లా అధ్యక్షులు దేశపాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు నకిరేకంటి అశోక్, ఇతర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 20న యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్లీనరీ చౌటుప్పల్‌లో నిర్వహిస్తున్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతి పరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమా వేశానికి పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం హాజరై దిశ నిర్దేశం చేస్తారన్నారు. తెలంగాణ ఉద్యమకారులతో, ప్రజానీకంతో మాట ముచ్చట ఉంటుందన్నారు.



వీరవెల్లిలో పీపీఆర్ టీకాలు పంపిణీ

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో ప్రభుత్వ సహకారంతో ఉచితంగా పీపీఆర్ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ నర్సింహాయాదవ్ మాట్లాడుతూ జిల్లా పశుసంవర్ధక శాఖ డాక్టర్ వి.కృష్ణ, మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష ఆదేశాల మేరకు వీరవల్లిలో పీపీఆర్ టీకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గొర్ల కాపరుల సంఘం అధ్యక్షులు దయ్యాల మహేష్ మాట్లాడుతూ గొర్ల కాపర్లు ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తోటకూర అశోక్, డైరెక్టర్లు జిట్టా శ్రీను, మోటే ఉప్పలయ్య, రేగు సుగుణమ్మ, రేగు అండాలు, కృష్ణ, కాపర్లు జిట్ట మల్లేష్, సర్దార్ గోపాల్‌కుమార్, రేగునాగమల్లి, రేగు శ్రీశైలం పాల్గొన్నారు.

క్షీణిస్తున్న నరేందర్ ఆరోగ్యం

నవతెలంగాణ-భువనగిరి

ప్రజలకు కావాల్సిన విద్య,వైద్యం,ఉపాధి,భూమి,ఇండ్లు సాధనకు ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ మహారాజ్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి, భూమి లేనివారికి ఒక ఎకరం భూమి, ఇండ్లు లేనివారికి 200 గజాల ఇంటిస్థలం కేటాయించే వరకు దీక్ష కొనసాగు తుందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐదు డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాగా మంగళవారం నుండి ఏమి తినకపోవడంతో నల్ల నరేందర్ ఆరోగ్యం కొద్ది కొద్దిగా క్షీణిస్తుంది. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌యాదవ్, జిల్లా నాయకులు లింగస్వామి, శాంతికుమార్, శివ, శ్రీకాంత్, పాల్గొన్నారు.



వీర చరిత్ర గల పార్టీ సీపీఐ

నవతెలంగాణ-రామన్నపేట

దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో అనేక మంది ప్రాణత్యాగాలు చేసిన వీర చరిత్ర గల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, పార్టీ మండలకార్యదర్శి ఊట్కూరి నరసింహ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, పార్టీ సీనియర్ నాయకులు బాలుగోని మల్లయ్య, ఊట్కూరి భగవంతుం, గంగాపురం వెంకటయ్య, రచ్చ యాదగిరి, ఐలాపురం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నప్రసాద వితరణ

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన ఆలకుంట్ల యాదగిరి 10వ వర్ధంతి సందర్భంగా ఆయన కొడుకు, కోడలు రాజు మాధవి బుధవారం చౌటుప్పల్‌లోని అమ్మానాన్న అనాథాశ్రమానికి వెళ్లి అందులోని వృద్ధులకు, మానసిక వికలాంగులకు అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు.మా నాన్నగారి వర్ధంతి సందర్భంగా అనాథాశ్రమంలోని వృద్ధులకు, వికలాంగులకు అన్నదానం చేయడం ఎంతో సంతృప్తికరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల నవీన్, నోములమల్లేష్, నోములచిరంజీవి, నోముల విష్ణు,నోముల నర్సింహ, చిప్పలపల్లి జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మోత్కూర్

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మంగళవారం మోత్కూర్ మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని, 30 పడకల ఆస్పత్రి, బస్సు డిపోఏర్పాటు చేయాలని,అసెంబ్లీలో తన గొంతును వినిపించడంతో బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు మందుల సామేల్ కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ మోత్కూర్ సమస్యను 30 ఏండ్లుగా ఏ ఒక్కరూ పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే మందుల సామేలు అసెంబ్లీలో మాట్లాడడం ఈ ప్రాంతం మీద ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుండగోని రామ చంద్రుగౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, మండలవర్కింగ్ ప్రెసిడెంట్ మాలిపెద్ది మల్లారెడ్డి,మండల ప్రధానకార్యదర్శి రాచకొండ బాలరాజు,మాజీ యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేష్, డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఎండీ.సమీర్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుంకిశాల అనిల్, పల్లపు సమ్మయ్య,కోమటి జనార్దన్,గుండు శ్రీను, అన్నెపు నర్సింహా,బందెల రవి, శేఖరాచారి,గుండు రాములు,శ్రీరాములు, లెంకల వేణు, రాజు,అమిర్, మున్నీర్,రమేష్, తదితరులు పాల్గొన్నారు.



రాబోయేది ప్రజాపోరాటాల కాలమే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహించనున్నట్లు, రాబోయేది ప్రజా పోరాటాల కాలమేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ తెలిపారు. బుధవారం ఆయన సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా మహాసభలు ఈనెల 15 ,16, 17వ తేదీలలో చౌటుప్పల పట్టణంలోని ఎస్ఎం.రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో 320 మంది ప్రతినిధులతో అత్యంత ఉత్సాహపూరితంగా జిల్లా మూడవ మహాసభలు నిర్వహించుకున్నామన్నారు. మహాసభలలో ప్రజా సమస్యలపై, జిల్లా సమగ్రాభివృద్ధిపై అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలను చేయడం కోసం సీపీఐ(ఎం) ముందుంటుందన్నారు.పార్టీ జిల్లా మూడవ మహాసభలలో జిల్లా సమగ్రాభివృద్ధి చిన్న నీటి ప్రాజెక్టులు, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే పరిశ్రమలపై, కార్మికుల కనీస వేతనాలు, విద్యా ఉపాధి వైద్యం, మహిళా సంరక్షణ, వ్యవసాయ రైతు సమస్యలపై అనేక తీర్మానాలు భవిష్యత్ కార్యాచరణ తీసుకున్నామని తెలిపారు. రామన్నపేట మండలంలో నిర్మించే తలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు పార్టీ శ్రీకారం చుట్టబోతుందన్నారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వల్ల



చుట్టుపక్కల ఉండే అనేక గ్రామాలు, వ్యవసాయం, చేతివృత్తులు, పాడి పరిశ్రమ, ప్రజల ఆరోగ్యం దెబ్బతిని రామన్నపేట మండలం మొత్తం నోమ్ జోన్‌గా మారే పరిస్థితి వస్తుందన్నారు.దీనిపై మహాసభలలో ప్రత్యేక తీర్మానాన్ని పెట్టి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించామని చెప్పారు. జిల్లాను పట్టిపీడిస్తున్న మూసీప్రక్షాళన,గోదావరి జలల సాధన కోసం, బస్వాపూర్ రిజర్వాయర్ పూర్తి కోసం ఇంకా ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించాలని పోరాటం, ట్రిబుల్ ఆర్, భద్రాచలం, గౌరెల్లి భూ నిర్వాసితుల పోరాటం, రాచకొండ భూములు స.నెం 273,106,96 లలో అనేకమంది పేద రైతులు 1000 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులందరికి పట్టాపాస్ పుస్తకాల కోసం పోరాటం తీసుకుంటామన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, చిన్న నీటి ప్రాజెక్టులైన పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, ఆసిఫ్ నహార్ కాలువల పూర్తి కోసం ప్రజా పోరాటాలు తీసుకుంటామని వివిధ రంగాలలో పనిచేసే ప్రతి కార్మికునికి కనీస వేతనం రూ.26వేలివ్వాలని కోరారు. కార్మిక ఉద్యమాలు, మహిళలపై జరుగుతున్న హింస, దారుణాలపై ఆందోళన పోరాటాలు నిర్వహించి జిల్లాలో ప్రతిపక్ష పార్టీగా సీపీఐ(ఎం) మరింత ముందుకు తీసుకుపోతామన్నారు.పార్టీ చేసే ప్రజా పోరాటాలలో ప్రజలందరూ భాగస్వాములయ్యే విధంగా సీపీఐ(ఎం) శ్రేణులు, నాయకత్వం గ్రామాలలో ప్రజాసమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తుందని రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) సత్తా చాటాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్, నాయకులు వనం రాజు, వల్లభదాసు రాంబాబు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని వినతి



నవతెలంగాణ-మోటకొండూరు

రాష్ట్ర వ్యాప్తంగా 12769 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న 60000 మంది కార్మికులందర్ని పర్మినెంట్ చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో నిన్నటి రోజున జరిగిన చలో ఇందిరా పార్క్ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు అక్రమ అరెస్టుల నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని మండల పరిషత్ అధికారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పారిశుధ్యకార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖర్ని వీడి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.1000000 కల్పించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. అతి ప్రమాదకరమైన ప్రభుత్వం ప్రవేశపెట్టిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వం రూ.9500 చేసినా ఈ ప్రభుత్వం సంవత్సరమైనా గ్రామపంచాయతీ కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ,సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొల్లూరి ఆంజనేయులు, మండల కన్వీనర్ వడ్డెబోయిన మహేందర్, టౌన్ కన్వీనర్ చెరుకుఅనిల్, కొల్లూరు సుధాకర్,జిల్లా నాయకులు గోసంగి పరమేష్,ఆడెపు ఇస్తారు, వంగపల్లి బాబు,గంధవల్ల నర్సింహ, సుదర్శన్, మదార, మన మైసయ్య, శ్రీధర్, ఎల్లమ్మ, లక్ష్మిఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీలకు కనీసవేతనం జీఓ నెంబర్ 60 ప్రకారం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి పాండు,కల్లూరి మల్లేశం

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు కనీస వేతనం జీఓ నెం: 60ప్రకారం రూ.26 వేలివ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్య దర్శులు దాసరి పాండు ,కల్లూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ముందు నిరసన తెలియజేసి, కలెక్టరేట్ ఏఓ, మెప్మా అధికారి కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ పట్టణాలలో మహిళాసంఘాలకు రుణాలు ఇప్పించడం, రుణాలు సకాలంలో చెల్లించే బాధ్యత,బుక్ కీపింగ్, ప్రభుత్వపథకాల ప్రచారం, ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించే విధంగా కృషిచేయడం, ఇలా అనేక పనులు చేస్తున్న ఆర్పీలకు కేవలం రూ.6వేలు మాత్రమే వేతనమివ్వడం సరికాదన్నారు.పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.ప్రమాదబీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలని, డ్రెస్‌కోడ్ రాష్ట్ర మొత్తం వేసేలా ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు, మెప్మా యూనియన్ నాయకురాలు వసంత,పరమేశ్వరి, పద్మ, భాగ్య చంద్రకళ, సురేఖ, చంద్రిక, సుజాత, రమ్య, రేణుక, సతీష్ పాల్గొన్నారు.



9వ రోజు కొనసాగిన సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

బసమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని భువనగిరి కలెక్టర్ కార్యాలయం ముందు సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి తొమ్మిదవ రోజుకు చేరుకుంది. సమ్మెకు ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యుడు తాటికొండ వెంకట రాజయ్య మద్దతు ప్రకటించి మాట్లాడారు. డిమాండ్లను నెరవేర్చేవరకు ఎట్టి పరిస్థితుల్లో పోరాటం ఆపొద్దన్నారు. మీ వెంటే ఉండి మీ సమస్య పరిష్కరించే వరకు ఎక్కడి వరకైనా పోరాటం పోరాటానికి సిద్ధమన్నారు.అనాథ పిల్లలు ,దిక్కు మొక్కు లేని ఎందరో ఆడపిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులను రోడ్డు మీద తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఎంతోమంది మేధావులను కళాకారులను తయారు చేసిందని విస్మరించ వద్దన్నారు.సమ్మెకు తెలంగాణ పెన్షనర్స్, విశ్రాంత ఉద్యోగుల సంఘం తరపున జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ బాబు, బాలరాజ్ , ఉపాధ్యక్షుడు బాలేశ్వర్ సంఘీభావం ప్రకటించారు. సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు సమ్మెకు మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సమగ్ర ఉద్యోగుల సంఘం కార్యదర్శి తిరుపతి, నాగార్జున,అరుణ, కృష్ణ పాల్గొన్నారు.



రైతు సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రైతు సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి మామిడాల భిక్షపతి అన్నారు.డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ హనుమంతరావును కలిసి జిల్లాలోని రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ భువనగిరి డివిజన్ కార్యదర్శి యిక్కిరి సహదేవ్, మామిడాల సోమయ్య ,అఖిల భారత రైతుకూలీ సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు, కళ్లెపు అడవయ్య, ప్రధాన కార్యదర్శి, మామిడాల బాలమల్లేష్, మారుజోడు సిద్దేశ్వర్,యిక్కిరి బీరయ్య, పైసా రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

నవతెలంగాణ-రాజపేట





సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ డీఎల్‌లను వెంటనే విడుదల చేయాలని,పీఆర్సీని ప్రకటించాలని తపస్ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మలి శ్రీహరి, పలుగుల రాజులు తెలిపారు. బుధవారం రాజాపేటలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అంతకుముందు రాజపేట మండల (తపస్) తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నమిల భరత్‌కుమార్(నమిల ప్రాథమికపాఠశాల ప్రధానో పాధ్యాయులు), అధ్యక్షులు దుడుకు జానయ్య(రాజపేట ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్), ఉపాధ్యక్షులుగా మాలోతు నారాయణ(పాముకుంట ఉన్నత పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్), ప్రధాన కార్యదర్శిగా పున్న సత్యానంద్ (పాముకుంట ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్), కోశాధికారిగా బండకింది బాలరాజు (పాముకుంట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు), కార్యదర్శిగా భూక్యా ప్రకాష్ (బొందుగుల ఉన్నత పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్), మహిళా కార్యదర్శిగా డి.స్వరూపారాణి(సోమవారం ఉన్నతపాఠశాల ఇంగ్లీష్‌స్కూల్ అసిస్టెంట్), కార్యవర్గ సభ్యులుగా కొండపల్లి రణధీర్ (జాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు), మల్లె బోయిన శ్రావణి (పారుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు), వనమాల రామలింగాచారి (రాజపేట హరిజనవాడ పాఠశాల ఉపాధ్యాయులు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వీరిని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.రాజపేట మండల జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఉప్పల రమేష్,రాజపేట మండల నూతన టీపీయూఎస్ కమిటీకి అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి



- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

నవతెలంగాణ-రాజపేట

ఇందిరమ్మ ఇండ్ల సర్వే ఎలాంటి తప్పులకు తావుల్లేకుండా వేగవంతంగా నిర్వహించాలని జిల్లా (రెవెన్యూ) అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లసర్వేను బుధవారం మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో దరఖాస్తు ఆధారంగా సర్వే సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వే ను తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల ప్రత్యేక మొబైల్‌యాప్‌లో నమోదుచేస్తున్న తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా లబ్దిదారుల వివరాలు సేకరిస్తూ ఆన్‌లైన్‌లో సజావుగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.ఇందిరమ్మ పథకం కింద పూర్తిస్థాయి అర్హతగల నిరుపేద కుటుంబాలకు ఇండ్లను అందజేసే లక్ష్యంతో సర్వే చేయాలని తెలిపారు. ఇక్కడైనా అవకతవకలకు పాల్పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాపాలన దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు ఇచ్చిన సమాచారం ప్రకారంఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామన్నారు.అంతకుముందు తహసీల్దార్ ఆఫీస్‌లో తనిఖీ చేయగా సమయానికి తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొని హాజరు రిజిస్టర్‌ని తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించి భూసమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్,ఎంపీడీఓ నాగవేణి,ఎంపీఓ ఆవులకిషన్,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులను గాయపరిచిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-వలిగొండ రూరల్

ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను గాయపరిచిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని వర్కట్‌పల్లికి చెందిన గోగు అఖిల ఇటీవల లోతుకుంటలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ గాయపర్చగా వారు విద్యార్థినిని పరామర్శించారు. సమాచారం తెలుసుకొని మాట్లాడుతూ జిల్లా అధికారులు వెంటనే ఆదర్శ పాఠశాలను సందర్శించి గాయపడ్డ విద్యార్థులను పరార్శించి, గాయపడ్డ వారికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని, అధికారులు సమస్యను తెలుసుకొని ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థులపట్ల ఉపాధ్యాయులు అధికారులు ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి సిర్పంగి స్వామీ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ

నవతెలంగాణ-రాజపేట

రాజపేట తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్ర మాన్ని ఆయన తహసీల్దార్ దామోదర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలని నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు.సంబంధించిన సైట్ సమస్య ఉన్న విషయాన్ని అడిషనల్ కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఎంపీడీవో కార్యాలయంలోని హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ దామోదర్, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర కార్యాలయ ఉద్యోగులు ఉన్నారు.

కళాశాలల నూతన భవనాలకు నిధులు మంజూరు

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల నూతన భవనాల నిర్మాణం కోసం భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రూ.11 కోట్ల 90 లక్షల నిధులను మంజూరు చేయించారు ఇటీవల కాలంలోప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సందర్శించిన సందర్భంగా జూనియర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లు నూతన భవనాలు ఆవశ్యకత మరియు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు దీనికి స్పందించిన మంత్రి తప్పక నూతన భవనాల నిర్మాణం కోసం మరియు వసతుల కోసం నిధలు మంజూరు చేయిస్తానని సభా వేదిక సమక్షంలో హామీ ఇచ్చారు తాగిన ప్రతిపాదనలు పంపాలని డిఇ ని ఆదేశించారు ఆయన ఇచ్చిన హామీ మేరకు నిధులను మంజూరు చేయించారు దీంతో నూతన భవనాలు ఏర్పాటుతో కళాశాలలో చదువుకునే విద్యార్థులకు మరిన్ని మెరుగైన వసతులు కలుగనున్నాయి

రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు

నవతెలంగాణ-కోదాడ రూరల్

ఆంధ్ర నుండి ధాన్యం వాహనాలు రాకుండా మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో సూర్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సరిహద్దుల్లో రామాపురం క్రాస్ రోడ్ వద్ద, అనంతగిరి మండల పరిధిలోని గొండ్రియాల సమీపంలో అన్నారం గ్రామ సమీపంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆంధ్ర నుండి వచ్చే ధాన్యపు వాహనాలను రాకుండా అడ్డుకుంటున్నారు. కానీ రెడ్లకుంట కూచిపూడి గ్రామాల మధ్య ఆంధ్ర రాష్ట్రా పరిధిలోని గ్రామం అన్నారం ఉండడం వలన ఇక్కడ వింత పరిస్థితి చోటు చేసుకుంటుంది. ఈ గ్రామం కూడా రామాపురం వెళ్లే రహదారిపై ఉంటుంది. కావున ధాన్యం ఏ గ్రామం నుండి వస్తుందో కనుక్కోవడం కూడా అధికారులకు తలకు మించిన భారంగానే ఉంది అని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ధాన్యపు రాశులు తీసుకువచ్చి ఆంధ్ర రాష్ట్రంలోని గ్రామాలలో పోసిన చేసేది ఏమీ లేదని అధికారులే తెలుపుతున్నారు. చెక్‌పోస్టు వద్ద ఫోర్స్ ఎక్కువగా ఉండేటట్లు చూడాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు. దీనివల్ల ధాన్యం రాకుండా అరికట్టవచ్చు అని తెలుపుతున్నారు.

ప్రగతికి కేరాఫ్ తుంగతుర్తి



- మందుల సారధ్యంలో ..సంక్షేమంలో దూసుకెళ్తున్న నియోజకవర్గం
- రూ.1203 కోట్ల ప్రత్యేక నిధులతో తుంగతుర్తి నియోజకవర్గం ప్రగతి పరుగులు
- విద్య,వైద్యం,వ్యవసాయం,రోడ్లే ప్రధాన లక్ష్యం
- ఎమ్మెల్యే మందుల సామేలుతో నవతెలంగాణ ఇంటర్వ్యూ

నవతెలంగాణ- తుంగతుర్తి

తుంగతుర్తి నియోకవర్గానికి అధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మందుల సామేలు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా తుంగతుర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై మందుల సామేలుతో నవతెలంగాణ ఇంటర్వ్యూ..

ఏడాది పాలన ఎలా ఉంది.... సంతృప్తినిచ్చిందా?

తెలంగాణ మలిదశ ఉద్యమం కోసం ఎన్నో సంవత్సరాలు ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగస్వామ్యం అయ్యాను...అయినా కేసీఆర్ టికెట్ ఇవ్వకుండా తీరని అన్యాయం చేస్తే,కాంగ్రెస్ పార్టీ ఆదరించి అవకాశం కల్పిస్తే నియోజకవర్గ ప్రజలు ఓటు రూపంలో తూటాలు పేల్చి,పోరాటాల బిడ్డనైన నాకు పట్టం కట్టారు. ఈ సంవత్సర కాలంలో తుంగతుర్తి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను. నా మీద నమ్మకంతో నన్ను గెలిపించిన నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం నాకు సంతృప్తినిచ్చింది.





ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు తీరు ఎలా ఉంది?

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది.మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం,క్వింట వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ కల్పించడం జరిగిందని, అదేవిధంగా ఇందిరమ్మ దరఖాస్తుల పరిశీలన కొనసాగుతుంది. తుంగతుర్తి నియోజకవర్గంలో రైతులకు 320 కోట్ల రుణమాఫీ చేయడం జరిగింది.

ఎన్నికల సమయంలో మీరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఇచ్చిన హామీలు ఏమిటి?అవి అమలైనవా?

తిరుమలగిరి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, తుంగతుర్తి, అడ్డగూడూరు మండలాలకు ఐటిఐ కళాశాల మంజూరు చేయడం జరిగింది.300 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు, కాంచనపల్లి కస్తూర్బా బాలికల విద్యాలయానికి 77 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం. తిరుమలగిరి, మోత్కూర్ మున్సిపాలిటీలకు 15 కోట్లు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేయించాను. తుంగతుర్తిలో వంద పడకల ఆసుపత్రి, మోత్కూరులో 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయించడం జరిగింది. నియోజకవర్గంలోని యువత కోసం అడ్డగూడూరు మండలంలో 180 ఎకరాలలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపడం జరిగింది. దీని ద్వారా 2000 మందికి ఉపాధి లభిస్తుంది.

నియోజకవర్గంలో వ్యవసాయం కోసం,సాగునీటి కోసం మీరు చేసింది ఏమిటి?

బునాదిగాని కాల్వ కోసం 267 కోట్ల రూపాయలు మంజూరు చేయించా. శాలిగౌరారంలో గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆసిఫ్‌నహర్ కాలువ భూసేకరణ సందర్భంగా ఒక కోటి 32 లక్షలు పరిహారం ఇప్పించి,కాలువను బాగు చేయించి10 చెరువులు నింపించా. బిక్కేరు మీద 30 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మించా. కేతిరెడ్డిపాడు ఆనకట్టకు 13 కోట్లు, దేవాదుల ప్రాజెక్టు ద్వారా తొండ, ఈదులబర్రెతండ, నందపురం, తాటిపాముల గ్రామాలకు, బిక్కేరు నుండి గంధముల ప్రాజెక్టు ద్వారా 20 గ్రామాలకు సాగునీరు అందించాను. గుండ్ల సింగారం దగ్గర నూతన బ్రిడ్జి నిర్మాణం, బిక్లేరు పై నూతన బ్రిడ్జి నిర్మాణం సంక్రాంతి వరకు పూర్తి చేస్తాను.

నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి గతంలో అధ్వానంగా ఉండేది?నాట్లు వేసిన పరిస్థితి ఉండే,ఇప్పుడు ఎలా ఉంది?

ఉపాధి హామీ పథకం కింద మంజూరైన 13 కోట్లతో నియోజకవర్గంలోని పలు చోట్ల సిసి రోడ్లు వేయడం జరిగింది.. తిమ్మాపురం నుండి కొమ్మాల,కోడూరు, సంగెం, వెంకేపల్లి, చిల్పకుంట్ల, నూతనకల్ వరకు 32 కోట్లతో డబల్ రోడ్డు,తుంగతుర్తి నుండి రావులపల్లి వరకు 16 కోట్లతో,శాలిగౌరారం నుండి రామగిరి వరకు 3 కోట్లు,గురజాల నుండి చౌవుళ్ళ రామారం వరకు 25 కోట్లు,తుంగతుర్తి మండలం లోని 12 తండాలకు 25 కోట్లతో బీటీ రోడ్లు వేయడం జరిగింది.నియోజకవర్గ వ్యాప్తంగా 9 మండలాల్లో 168 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనుల కోసం కృషి చేయడం జరుగుతుంది.

ముఖ్యమంత్రితో మీరు చనువుగా ఉంటారు కదా....మీ నియోజకవర్గానికి ఏపాటీ లబ్ధి చేకూరింది?

తుంగతుర్తి నియోజకవర్గంలో ఇప్పటివరకు 1203 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేయడం జరిగింది.సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటివరకు రెండు కోట్లు ఇప్పించాను.నియోజకవర్గ అభివృద్ధి కోసం అందరి మంత్రులను కలిసి నిధులు తెప్పించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాను.

నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటి?

తుంగతుర్తి నియోజకవర్గం పోరాట యోధులకు పుట్టినిల్లు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు భీమిరెడ్డి నరసింహారెడ్డి,మల్లు స్వరాజ్యం ఇక్కడ ఎమ్మెల్యేలుగా పనిచేశారు.బహుజన విప్లవ వీరుడు మారోజు వీరన్న పుట్టిన గడ్డ.అలాంటి గడ్డపై నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 51094 ఓట్ల మెజార్టీతో గెలిపించి ఎమ్మెల్యేను చేసిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను.తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

మెప్మా ఆర్పీకు రూ.19వేల కనీస వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ .లక్ష్మీనారాయణ



నవతెలంగాణ-క్లాక్‌టవర్

తెలంగాణ రాష్ట్రంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఆర్ పి అందరికీ గత పిఆర్సి జీవో 60 ప్రకారం 19 కనీస వేతనాన్ని వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మెప్మా రిసోర్స్ పర్సన్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపాలిటీలో ఉన్న ఎస్ హెచ్ జి గ్రూపులకు బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి రుణాలు ఇప్పించడం సకాలంలో చెల్లించేలా చూడడం మహిళల అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయపడుతున్న ఆర్పి లకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక రకాల సర్వేలు డబల్ బెడ్ రూమ్ సర్వే, అనాధ పిల్లల సర్వే తో పాటు అనేక సంక్షేమ పథకాలలో పాల్గొంటున్నారని అన్నారు అయినా వీరికి కనీస వేతనం ఉద్యోగ భద్రత భీమా ఎలాంటి సౌకర్యాలకు నోచుకోక అభద్రత లో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. వీరికిస్తున్న ఈ కొద్దిపాటి వేతనం కూడా 8 నెలలుగా పెండింగ్ లో ఉందని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు అద్దంకి నరసింహ,అవుట రవీందర్, యూనియన్ నాయకులు ఎస్ జ్యోతి, కె సుజాత, ఎ స్వరూప,ఎం సరిత, ఎండి పర్వీన్,ఆర్ పాపయ్య , జె సైదులు, జి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెధిరే పూలమ్మ ఫౌండేషన్ సేవలు చరిత్రలో నిలిచిపోతాయి

- ఎస్సై ఇరుగు రవి



నవతెలంగాణ- మునుగోడు

పుట్టిన ఊరు అభివృద్ధి కోసం వెధిరే పూలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు చరిత్రలో నిలిచిపోతాయని మునుగోడు ఎస్సై ఇరుగు రవి , మండల విద్య అధికారి రవీందర్ అన్నారు . బుధవారం మండలంలోని కొంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెధిరే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన స్టేజి నిర్మాణంకు భూమి పూజ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో విద్య వైద్యం సౌకర్యాలు మెరుగుపడ్డప్పుడే ఆ గ్రామం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని అన్నారు . గ్రామంలోని ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉంటూ , విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పిస్తున్న వెధిరే బ్రదర్స్ ను అభినందించారు . శంకుస్థాపనకు వచ్చిన ఎస్సై , ఎంఈఓ ను దేవాలయ కమిటీ చైర్మన్ వెధిరే విజేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు జాల వెంకన్న యాదవ్ , బోయపర్తి లింగయ్య , కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దామ్ యాదయ్యా , జీడిమడ్ల మల్లయ్య , జాల నరసింహ , వీరమల్ల అశోక్ , జీడిమడ్ల నరసింహ , బాజా మనోజ్ , సూర శంకరయ్య , బోయపర్తి ప్రసాద్ పాఠశాల ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టుల పట్ల కార్మికుల నిరసన



నవ తెలంగాణ-దామరచర్ల

తమ సమస్యలను తెలియజేయడం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఒకపక్క ప్రభుత్వం అనుమతిస్తూ మరో పక్కకార్మికుల ను ఎక్కడెక్కడ అక్రమ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయితీ కార్మికులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ వర్కర్స్ కి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రిస్మస్ పండుగ , సంక్రాంతి పండుగలు వస్తున్నందున తక్షణమే వేతనాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీడీవో మూర్తి కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షులు వాడపల్లి శ్రీరాములు , జీపి జిల్లా కమిటీ సభ్యులు ఎండి జహీరుద్దీన్, సైదులు, గుండె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు .

సహాయ కార్యదర్శిగా రాములు ప్రమాణ స్వీకారం

నవ తెలంగాణ- నకిరేకల్

సికింద్రాబాద్ హరి హర భవనం లో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం లో నూతన అద్యక్షులు వల్లకాటి రాజ్ కుమార్ ఆద్వర్యం లో నకిరేకల్ కు చెందిన పెండెం రాములు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘ సహాయ కార్యదర్శి గా ప్రమాణ శ్రీకారం చేశారు. కార్యక్రమం లో నకిరేకల్ పద్మశాలి సంఘ డైరెక్టర్లు పెండెం గణేష్, పున్న శంభయ్య, ఏలె గణేష్, మూడుదుడ్ల శ్రీను, మిర్యాల నర్సయ్య, చిట్టిపోలు యాదగిరి, ఏలె గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలి


నవతెలంగాణ - నాంపల్లి

విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు సహకరించాలని నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంధం మోహన్ రావు కోరారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు రూపొందించిన 90 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుకు తల్లిదండ్రులు సహకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులచే సూచనలు., సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకన్న, రజనీకాంత్, శ్రీనివాస్, ముత్యాలు, శిరీష, సైదయ్య, ప్రసన్న లత, శైలజ, సురేష్, సమత, సృజన్ కుమార్, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా అబార్షన్ కిట్లు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం

- ఏరియా ఆసుపత్రుల వారిగా, డివిజన్ల వారీగా సమీక్ష
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



జిల్లాలో వైద్యుల ప్రెస్క్రిప్షన్ లేకుండానే కొన్ని మెడికల్ షాపులు, ఆసుపత్రులలో అబార్షన్ కిట్ల అమ్ముతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, వైద్యుల అనుమతి లేకుండా అబార్షన్ కిట్లు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. బుధవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ పై నిర్వహించిన సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ మాత శిశు మరణాలు లేని జిల్లాగా నల్గొండ జిల్లాను తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రసవం సమయంలో, అలాగే ప్రసవానంతరం మాతృ మరణాలు, శిశు మరణాల వంటివి సంభవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ తోపాటు, సంబంధిత శాఖల పై ఉందన్నారు. ప్రసవ సమయంలో, ప్రసవా నంతరం తల్లిదండ్రులు సరైన విధంగా జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి కారణాలవల్ల శిశు మరణాలు సంభవిస్తున్నాయని డాక్టర్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా వ్యాప్తంగా పుట్టిన శిశువుకి పాలివ్వడం, అదేవిధంగా జాగ్రత్తలు తీసుకునే విషయంపై అవగాహన కల్పించేందుకు లాక్టేషన్ (చనుబాలివ్వడం) పై కౌన్సిలర్లను నియమించాలని ఆదేశించారు. రానున్న మూడు వారాలు మూడు డివిజన్లో వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి మాత శిశు సంరక్షణపై సమీక్ష నిర్వహిస్తామని, ఈ సమావేశంలోజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ఓ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి ,జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటిండెంట్ అరుణకుమారి సంబంధిత ఆస్పత్రుల వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

పూర్తి వివరాలు అప్లోడ్ చేసిన తర్వాతే యాప్‌లో సబ్మిట్ చేయాలి

పూర్తి వివరాలు అప్లోడ్ చేసిన తర్వాతే యాప్‌లో సబ్మిట్ చేయాలని, లేనట్లయితే ఇబ్బందులు తలెత్తుతాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గుర్రంపోడు మండలంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన సర్వేను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. తప్పనిసరిగా దరఖాస్తుదారుకు సంబంధించిన ఫొటోతో సహా ఇంటి ధ్రువపత్రాలు, ఒక వేళ కొత్తగా ఇల్లు నిర్మించుకునేలా ఉంటే కొత్త ఇంటి స్థలానికి సంబంధించిన వివరాలను అప్లోడ్ చేయాలని చెప్పారు.సజ్జేన్నాయి చింత గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న ఇండ్లకు వెళ్లి దరఖాస్తుదారు పేర్లు, ఇప్పటివరకు గ్రామంలో నిర్వహించిన సర్వే వివరాలు, తదితర వివరాలను పంచాయతీ సెక్రటరీ స్వీటీ, ఎంపీడీవో మంజుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. జిన్నాయి చింత గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 177 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటివరకు 77 దరఖాస్తుల వివరాలను తనిఖీ చేసి అప్లోడ్ చేయడం జరిగిందని, తక్కినవి అప్లోడ్ చేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఆమె వెంట దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పి డి రాజ్ కుమార్, ఎంపీఓ పద్మ తదితరులు ఉన్నారు.



సాయి మందిరంలో అన్నప్రాసన మహోత్సవం

నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని నల్లబండ గూడెం గ్రామ పరిధిలోని సాయి మందిరంలో రెడ్లకుంట కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మల్లెల ప్రసాద్ మనవడు ప్రణీత్ అన్నప్రసన్న మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి సిద్ధార్థ శ్రావ్య దంపతుల కు మారుడు ప్రణీత్‌తో కలిసి దేవాలయంలో ప్రత్యేక పూజలు అన్నదానం నిర్వ హించారు. ముఖ్య అతిథిగా రెడ్లకుట కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగవరపు లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గుడి చైర్మన్ నల్లపాటి నరసిం హారావు, తాతా దొడ్డ సైదయ్య, భవాని, అర్చకుడు సాయి శర్మ, గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం పోటీల నిర్వహణ

నవతెలంగాణ-భువనగిరి



క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలిగితే రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీల్లో నిర్వహిస్తుందని జిల్లా యువజన క్రీడల అధికారి కే.ధనుంజయ తెలిపారు. బుధవారం సీఎం కప్ పురస్కరించుకొని స్థానిక టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ కళాశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుండి సీఎం కప్‌గా చెస్, ఫుట్‌బాల్, సైక్లింగ్, బాస్కెట్‌బాల్ జిల్లా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి ధనుంజయ మాట్లాడారు. సీఎం కప్ గ్రామీణ ప్రాంతాలు, మండల ప్రాంతాల్లో ఎంపికైన క్రీడాకారులకు జిల్లాస్థాయిలో తేదీ 16 నుండి ప్రారంభించుకొని 21 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు క్రీడాస్పూర్తి తోఆడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంత క్రీడాకారుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం పోటీలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖో ఖో అసోసియేషన్ సెక్రెటరీ నాతి కృష్ణమూర్తి అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ గోపాల్, దశరెడ్డి, పాండురంగం, రఘువీర్, కేశనాగులు, వివిధ క్రీడల పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డెక్కన్ సిమెంట్స్‌లో వైద్య శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-పాలకవీడు

భవానిపురం డెక్కన్ సిమెంట్స్ కర్మాగార యాజమాన్యం ఆధ్వర్యంలో మిర్యాలగూడ బాలాజీ మల్టి స్పెషాలిటీ హాస్పిటల్స్ వైద్య నిపుణులచే, బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిరంలో సమీప గ్రామాల నుండి వచ్చిన సుమారు 300 మంది గ్రామస్తులను ఉద్దేశించి సంస్థ వైస్ ప్రెసిడెంట్ యస్. శ్రీనివాస్ రాజు,చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్ నాగమల్లేశ్వర రావ్ ఆరోగ్య పరంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సమీప గ్రామాల విద్యార్థినులకు ఋతుచక్రం పై, ఆరోగ్య జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలాజీ హాస్పిటల్స్ డాక్టర్లు పిల్లల, కంటి, దంత సమస్యలు, స్త్రీ సంభందిత సమస్యలు, సాధారణ సమస్యలతో వచ్చిన రోగులను ఉచితముగా వైద్య పరీక్షలు నిర్వహించి,తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెక్కన్ సిమెంట్స్ సంస్థ అందరికీ ఉచితముగా మందులు పంపిణీ చేసి రోగులందరికి ఆహార పదార్థాలు, నీరు, రవాణా తదితర సౌకర్యాలను అందించారు.

డాక్టర్స్ కాలనీలో పర్యటించిన డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నవతెలంగాణ- మిర్యాలగూడ రూరల్

జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశానుసారం డిఎస్పీ రాజశేఖర్‌రాజు, టూటౌన్ సిఐ నాగార్జున ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని డాక్టర్‌న కాలనీలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలో భాగంగా డాక్టర్స్ కాలనీలోని ఆసుపత్రి, మెడికల్‌షాపు నిర్వాహకులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని లేనట్లయితే కేసులు నమోదు చేస్తామన్నారు. డాక్టర్స్ కాలనీలో ఆసుపత్రి నిర్వాహకులు, మెడికల్‌షాపు వారు రోడ్లపై ఏర్పాటు చేసి బోర్డులను ట్రాఫిక్ ఎస్ఐ బండి మోహన్‌యాదవ్ పోలీసు సిబ్బందితో కలిసి తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది చంద్రశేఖర్, క్రాంతికుమార్, నాగరాజు, సుమన్, అక్రమ్, ఉన్నారు.

విద్యార్థులకి క్రీడా సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చాలెంజర్స్ ఆధ్వర్యంలో బుధవారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అ క్లబ్ ప్రతినిధి రేపాల మదన్ మోహన్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువు తోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కా ర్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్గొండ చాలెంజర్స్ అధ్యక్షులు అద్దంకి కృష్ణమాచారి, కార్యదర్శి సూదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పెండ్యోళ్ల సోమయ్య, పిచ్చయ్య, చార్టెడ్ ప్రెసిడెంట్ వనం శ్రీకిషన్ పాఠశాల ప్రధానో పా ధ్యాయులు రాములు ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-తిరుమలగిరి



తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను మున్సిపల్ చైర్మన్ శాగంటి అనసూయ రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టాలని సూచించారు. అదేవిధంగా నూతన మెస్ చార్జీల పెంపు అనేది ఎప్పటినుండో ఉన్న డిమాండ్, దానిని మన కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయినిలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పోటీ పరీక్షల్లో మల్లేష్ ప్రతిభ

నవతెలంగాణ-చిట్యాల



తెలంగాణ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ ప్రభుత్వ డైట్ కళాశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పోటీ పరీక్షలు నిర్వహించగా మండల పరిధిలోని వని పాకల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బక్కతట్ల మల్లేష్ పదవ తరగతి చదువుతున్నాడు. ఈ పోటీ పరీక్షల్లో ఆయన పాల్గొని ద్వితీయ బహుమతి పొందాడు. మేడిహరి బర్రె ధనలక్ష్మి లు మండల స్థాయిలో ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాణాల శ్రీనయ్య చారి, దంతూరి సైదులు, గంపల రవీందర్ రెడ్డి, కవిత, జ్యోతి, చొల్లేటి నరసింహ చారి, నజీర్, ఉన్నిసా, విజయ, మహేందర్ రెడ్డి, విద్యార్థులు గ్రామస్తులు అభినందించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-మునగాల

తెలంగాణా మోడల్ స్కూల్లో ఇంటర్‌లో కామర్స్ సబ్జెక్టు బోదించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని పాఠశాల ప్రిన్సిపల్ సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా 9వతరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం బోదించేందుకు ఎంకామ్. బిఈడి చేసి వుండాలన్నారు. ఈ నెల19, 20తేదీలలో నేరుగా పాఠశాలలో సంప్రదించిన వారికి డెమో క్లాసు నిర్వహించి వెంటనే ఎంపిక చేస్తామని తెలిపారు. ఆశక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
గురువారం | డిసెంబర్ 19, 2024 | www.navatelangana.com

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-మర్రిగూడ



గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘంమండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్మికుల అక్రమ అరెస్టుకు నిరసనగా ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.తమ సమస్యల సాధనకై జిపి కార్మికులు చేస్తున్న సమ్మెను ఆపడం,ఎక్కడికక్కడ నిర్బంధించి అరెస్టులు చేయడం ప్రభుత్వ సరైన నిర్ణయం కాదన్నారు.ఈనెల 27,28 తేదీలలో మండల కేంద్రాలలో జి పి కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారని,ఈ లోగ ప్రభుత్వం తక్షణమే స్పందించి జిపి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఊరి పక్క లింగయ్య,చింతపల్లి యాదయ్య,పోలేపల్లి రాములు,మైలారం నరసింహ, పెరుమాండ్ల మంజుల,ఎడ్ల రమణ,మాడుగుల అంజయ్య,ఒంపు ముత్తమ్మ,సిల్వేరు మహేష్,ఊరి పక్క వెంకటయ్య,ఐతపాక పద్మ,తదితరులు పాల్గొన్నారు.

మండలాల వారీగా కబడ్డీ కమిటీలు

నవతెలంగాణ-హుజూర్ నగర్

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ పిలుపుమేరకు హుజూర్నగర్ నియోజకవర్గంలో ఈరోజు కబడ్డీ మండలాల వారీగా కమిటీలను ఎంపిక చేయడంలో భాగంగా హుజూర్నగర్ మండల అసోసియేషన్ ఎన్నికైన నిర్వహించడం జరిగింది ఈ ఎన్నికకు రాష్ట్ర అడ్ హక్ కమిటీ సభ్యులు భూలోకారావు కర్తయ్య మహబూబ్ జానీ మధుల ఆధ్వర్యంలో కబడ్డీ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అల్లం ప్రభాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో గ్రామాల నుండి ఉన్నత స్థాయిలో ప్రతిభ కనపరిచిన వారిని మండలాల వారీగ ఎంపిక చేసి జిల్లా కబడ్డీ రాష్ట్ర కబడ్డీ పోటీలలో పాల్గొనేలా క్రీడాకారులను తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో త్వరలో మినీ స్టేడియం శంకుస్థాపన పనులు నిర్వహించనున్నామన్నారు హుజూర్నగర్ మండల కమిటీలో కార్యదర్శిగా రమేష్ బాబు జాయింట్ కార్యదర్శిగా పి క్రాంతి కుమార్ కోశాధికారిగా గువ్వల వీరయ్య ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వై వినోద్ పి నాగరాజు, మహేష్ నాగరాజు ఎంపికయ్యారు

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన అస్తవ్యస్తం

- యాపుల్ లో రోజుకొక తీరు నమోదు
- సిబ్బందికి యాప్ వివరాల నమోదుపై అవగాహన లోపం
- యాప్ కు. సాంకేతిక లోపాలు
- నమోదు వేరి స్లో..
- విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన చింతపల్లి ఎంపీడీవో కు
- సోకాజ్ నోటీసు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి
- సమస్య పరిష్కారానికి. నల్లగొండలో టోల్ ఫ్రీ నెంబర్ 18004251442

నవతెలంగాణ -నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ఏడాది ప్రారంభంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్ ను రూపొందించారు. అదే క్రమంలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది ఉమ్మడి నల్లగొండ జిల్లాలో .ఇందిరమ్మ ఇండ్ల కు 9 లక్షల 2వేల 899 దరఖాస్తు లు వచ్చినట్లు తెలుస్తుంది.ఈ దరఖాస్తులను ఇన్స్పెక్షన్ మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల గుర్తింపు. చేయాలి.నల్గొండ జిల్లాలో మొత్తం 4,31,831 సూర్యాపేట జిల్లాలో మొత్తం 3.09.068 భువనగిరి జిల్లాలో 1 లక్ష,62 వేల దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు..

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన అస్తవ్యస్తం

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి జిల్లాలో జిల్లా కలెక్టర్ లు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించినప్పుడు కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దరఖాస్తుల పరిశీలనకు రూపొందించిన ఈ యాప్ లో పూర్తిస్థాయిలో సిబ్బందికి అవగాహన లేకపోవడంతో కొన్నిచోట్ల అసంపూర్తిగా అప్లోడ్ చేసినట్లు గుర్తించారు. ఈనెల 31 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం కోసం అధికారులు కిందిస్థాయి సిబ్బందితో పని చేయిస్తున్నారు. ఈ యాప్ నీ పూర్తి స్థాయి అవగాహన లేకపోవడంతో ఈ యాప్ లో ఉన్న 22 ప్రశ్నలకు సమాధానాలు సేకరించకుండానే, వ్యక్తి ఫోటో, ప్రస్తుత ఇంటి ఫోటో, ఇల్లు నిర్మించుకునే స్థలం ఫోటో, ఈ యాప్ లో అప్లోడ్ చేయాల్సింది. చాలా గ్రామాల్లో ఈ విషయాలు లేకుండానే అప్లోడ్ చేసినట్లు వెలుగు వస్తున్నాయి.కులం,చిరునామా, వృత్తి అర్హులా కాదా అనే అంశాన్ని కూడా యాప్ లో మొదట్లో పొందుపరిచి ఉన్నారు. సర్వేకు వచ్చిన వారే అర్హుడా? కాదా? అనే విషయాన్ని అందులో నమోదు చేశారు. .

యాపుల్ లో రోజుకొక తీరు నమోదు..

ఇన్స్పెక్షన్ మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల గుర్తింపు. చేయాల్సి ఉండగా రోజుకో తీరు మారుతుంది . యాప్ లో మొదటగా సర్వే సిబ్బంది లబ్ధిదారుడు ఇంటి కోసం అర్హుడా? కాదా? అనే విషయాన్ని ఈ యాప్ లో అప్లోడ్ చేయాల్సి ఉండే. ఇలా మొదట గ్రామాల్లో సర్వే నిర్వహించి ఆయా సిబ్బంది నమోదు చేశారు. ప్రస్తుతం ఈ యాప్ లో ప్రత్యేక మార్పులు తెస్తూ. అర్హుడా? కాదా? అనే అంశాన్ని తొలగించారు. అర్హుడా? కాదా? అనే విషయాన్ని సర్వే తర్వాత ప్రభుత్వం నిర్ణయిస్తుంది. అందుకోసమే వచ్చిన సర్వే అధికారి పూర్తిస్థాయిలో వివరాలను మాత్రమే పొందుపరచాలని యాప్ లో మార్పులు తెచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో మొదట్లో పరిశీలించిన దరఖాస్తుల్లో పరిశీలన అధికారి అర్హుడా? కాదా? విషయాన్ని నమోదు చేయడంతో పూర్తిస్థాయిలో వివరాలు నమోదు కాని వారు అనర్హులుగా ప్రకటించబడుతున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బందికి యాప్ వివరాల నమోదుపై అవగాహన లోపం

ఇన్స్పెక్షన్ మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల గుర్తింపు. చేయాల్సి ఉండగా మేజర్ గ్రామపంచాయతీలో, మున్సిపాలిటీలలో పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్ కు మాత్రమే యాప్ ద్వారా సమాచారాన్ని నిక్షిప్తం చేయాల్సి ఉంది. మేజర్ గ్రామపంచాయతీలో 12 నుంచి 14



గ్రామ పంచాయతీల వరకు ఉండడం వల్ల దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు ఎక్కువ ఉండడంతో కిందిస్థాయి సిబ్బందికి యాప్ లింకు పంపి నమోదు చేయిస్తున్నారు..ఇన్స్పెక్షన్ మొబైల్ యాప్ పై కేవలం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నమోదు చేసే వివరాలను వెల్లడించడం మినహా ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. పంచాయతీ కార్యదర్శులు కిందిస్థాయి సిబ్బందికి నమోదు చేయాలని పంపించడంతో వారికి అవగాహన లేక అందుబాటులో ఉన్న సమాచారాన్ని అప్లోడ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాకుండా ఎక్కడైతే దరఖాస్తుల పరిశీలన చేస్తున్నారో ఆ ప్రాంతంలో ముందస్తుగా టామ్ టామ్ వేయించి లబ్ధిదారులు అందుబాటులో ఉండే విధంగా చేయాల్సి ఉంది. అలాంటి ప్రక్రియ ఎక్కడ జరగడం లేదు.

యాప్ కు. సాంకేతిక లోపాలు

ఇన్స్పెక్షన్ మొబైల్ యాప్ కు అనేక సాంకేతిక లోపాలు ఉండడంతో నెట్ వర్క్ సమస్య , ఆయా పంచాయితీ కార్యదర్శులు నుంచి ఓటిపి నమోదు చేయడం, మళ్లీ కొనసాగించడం చేయడం ద్వారా నమోదు ప్రక్రియ చాలా స్లోగా కొనసాగుతుంది. లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం, ఉన్నవారి దగ్గర పూర్తిస్థాయిలో పత్రాలు లేకపోవడం, ఫోటోను అప్లోడ్ చేయడం కష్టతరంగా మారింది. యాప్ లో సాంకేతిక లోపాలు ఉండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సమస్య తలెత్తుతుంది.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన చింతపల్లి ఎంపీడీవో కు సోకాజ్ నోటీసు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించడం, కిందిస్థాయి సిబ్బందికి యాప్ వివరాల నమోదుపై అవగాహన కల్పించనందుకు గాను నల్గొండ జిల్లా, చింతపల్లి ఎంపీడీవో సుజాతకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆదేశించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ చింతపల్లి మండలం, ఘాసిరాం తండా, నసర్లపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ మండలంలోని ఘాసిరాం తండాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారు ఇండ్ల కు వెళ్లి సర్వే బృందం యాప్ లో నమోదు చేసిన వివరాలను సెల్ఫోన్ ద్వారా పరిశీలించారు. రమావత్ శంకర్, కోర్ర సరిత తదితర దరఖాస్తుదారుల ఇళ్లను పరిశీలించి అక్కడ వివరాల నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ దరఖాసుదారుల ఇంటితో సహా తీసుకున్న ఫోటో, అలాగే ఇంటి ధ్రువపత్రాల అప్లోడింగ్ వివరాలను అడగగా, ఫోటో అప్లోడ్ చేయకపోవడం, ధ్రువపత్రాలు లేక తాత్కాలిక అప్లోడ్ చేయడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సిబ్బందికి యాప్ పరిశీలనపై ముందే అవగాహన ఎందుకు కల్పించలేదని, సర్వే పై గ్రామంలో ముందే ప్రజలకు చెప్పకపోవడం పై ఎంపిడిఓపై ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటిస్ జారీ చేయాల్సిందిగా ఆదేశించారు.

దరఖాస్తు చేసుకుని వారికోసం మళ్లీ అవకాశం.

గతంలో ఏదైనా కారణం చేత ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా దరఖాస్తు చేసుకో లేకపోయిన వారు ఇప్పుడు ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటుచేసిన ప్రజా పాలన మీ-సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సమస్య పరిష్కారానికి. నల్లగొండలో టోల్ ఫ్రీ నెంబర్ 18004251442

ఇందిరమ్మండ్ల దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004251442 నెంబర్ కు ఫోన్ చేసి తెలియజేయాలని కలెక్టర్ ప్రజలకు తెలిపారు..అలాగే అధికారులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, సిబ్బంది దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన సందేహాలను ఈ నెంబర్ కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని నల్లగొండ కలెక్టర్ తెలిపారు.

ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం

నవతెలంగాణ- చండూరు



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) గట్టుపల మండల కమిటీ సమావేశం చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రెండు లక్షల రుణమాఫీ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గ్యాస్ సబ్సిడీ, మహిళలకు 2500 పింఛను,కొత్త రేషన్ కార్డులు,అర్హులైన పేదలందరికీ వృద్ధాప్య పింఛన్లు,అర్హులైన పేదలందరికీ, ఇంటి జాగా ఇంటి నిర్మాణానికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 19, 20 తేదీలలో గట్టుప్పల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గట్టుప్పల మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం,ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, మండల కమిటీ సభ్యులుచాపల మారయ్య, కర్నాటి సుధాకర్, బొట్ట శివ కుమార్, రాములు, పి శ్రీనివాస్, రావుల నరసింహ, పి యాదగిరి, ఏ శ్రీనివాస్, టి కృష్ణ, శ్రీశైలం, వెంక రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలి

గ్రామీణ ప్రాంతాలలో లింకు రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుబండశ్రీశైలం అన్నారు. బుధవారం చండూరు మండల పరిధిలోని నేర్మ ట గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశం ఈరటి వెంకన్నఅధ్యక్షతనసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్మట గ్రామం నుండి చుట్టుపక్క గ్రామాలకు లింకు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నేర్మట నుండిశేరి గూడెం, పుల్లెంల, గొల్లగూడెం, లెంకలపల్లి ఈ గ్రామాలకు రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు వెంటనే రోడ్లు వేయాలని కోరారు. .ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శి బెల్లం స్వామి, ఈరటి వెంకన్న, పండు,లక్ష్మమ్మ, లింగమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు సిద్ధం

నవతెలంగాణ-కోదాడ టౌన్



సూర్యాపేట జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఈనెల 19, 20న కోదాడ పట్టణంలో సిసిఆర్ పాఠశాల యందు నిర్వహించబడటానికి కావలసిన ఏర్పాట్లను సర్వం సిద్ధం చేస్తున్నట్లుగా బుధవారం సూర్యాపేట జిల్లా సైన్స్ అధికారి (డిఎస్ఓ) దేవరాజు, కోదాడ మండల విద్యాధికారి ఎండి. సలీం షరీఫ్ తెలియజేశారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కోదాడ హుజూర్నగర్ డివిజన్లకు సంబంధించిన ప్రదర్శనల రిజిస్టర్ రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయ ఉన్నట్లు తెలిపారు. నేడు ఉదయం 9 గంటల వరకు మిగిలిన డివిజన్ల వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 1గంట నుండి కోకరికుల మ్ కార్యక్రమాల పోటీలు వ్యాసరచన, డిబేటింగ్, క్విజ్ నిర్వహించబడు నని తెలిపినారు. వివిధ కమిటీలకు సంబంధించిన కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులు ప్రదర్శనలకు సంబంధించిన విద్యార్థులతో గైడ్ టీచర్స్ సకాలంలో కోదాడ యందు సిసి రెడ్డి పాఠశాలకు చేరుకోవాల్సిందిగా తెలియజేసినారు.

'క్రీడాకారులను వెలికి తీయడమే సీఎం కప్ లక్ష్యం'

నవ తెలంగాణ-సూర్యాపేట



గ్రామస్థాయి నుండి క్రీడాకారులను వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్, సీఎం కప్ క్రీడల జిల్లా ఇన్‌చార్జి ఆదాం బాబాలు అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చెస్ క్రీడలను వారు ప్రారంభించి మాట్లాడారు. చెస్ క్రీడలతో మేధోసంపత్తి పెరిగి చదువులో రాణిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెస్ క్రీడలకు ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. మేకల అభినవ్ చెస్ క్రీడతో జాతీయస్థాయిలో రాణించారని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా చెస్ క్రీడలను అభివృద్ధి చేస్తూ క్రీడాకారులను,విద్యార్థులను ప్రోత్సహిస్తున్న గండూరి కృపాకర్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ గోలి పద్మ, జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ సతీష్, కోశాధికారి మురళి, నల్గొండ జిల్లా చేస్ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి, పీడీలు విశ్వజ్ఞ చారి, వెంకటేశ్వర్లు, రామ్మోహన చారి, విజయ్ కుమార్, నాగేందర్, ఉపాధ్యాయురాలు అరుణ, భారతి, బిక్షం, వెంకటేష్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- సూర్యాపేట ఎంఈఓ శేషగాని శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-సూర్యాపేట



విద్యార్థులు సైన్స్ టాలెంట్ టెస్టులు, సెమినార్లలో తరచుగా పాల్గొంటూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూర్యాపేట మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాల భవన్‌లో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పలు సైన్స్ సెమినార్లు, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు, టాలెంట్ టెస్టలలో పాల్గొనడం ద్వారా సైన్స్ పట్ల ఆసక్తి నెలకొనడమే కాక శాస్త్రీయ దృక్పథం కూడా పెంపొందుతుందన్నారు. బయోలాజికల్ సైన్స్ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిలకర శ్రీనివాస్ మాట్లడుతూ టిబియస్ఎఫ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం ఈ పోటీలు నిర్వహిస్తూ వారిలో పోటీ తత్వాన్ని పెంపొందించడమే కాక సైన్సు పట్ల జిజ్ఞాసను కలుగచేస్తుందన్నారు. పరీక్ష అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన శ్రీహర్షిత-ఇమాంపేట మోడల్ స్కూల్, రాజేశ్ -నేరేడుచర్ల బీసీ గురుకుల పాఠశాల, మనీషా-పెదనెమిల ఉన్నత పాఠశాల, అబీబ్-అనంతగిరి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సూర్యాపేట బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ రాణి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, లక్ష్మీ పాల్గొన్నారు.

రఘునాథపురం గ్రామంలో బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తా

- ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీశ్రవ్య

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని రఘునాథపురంలో బ్యాంకు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆర్‌బీఐ ఏజీఎం ఎం. లక్ష్మి శ్రవ్య అన్నారు.సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ అనే స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరస్యతపై అవగాహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె జిల్లా ఎల్‌డీఎం శివరామకృష్ణతో కలిసి మాట్లాడారు.ప్రజల కోరిక మేరకు గ్రామంలో బ్యాంకు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు.ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలంటే ముందుగ వస్తున్న ఆదాయం నుండి పొదుపు చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు.అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు ఖాతా లేకుంటే జరిగే నష్టాలను గురించి వివరిస్తూ, బ్యాంకులో ఖాతా తెరవడంతో కలిగే ప్రయోజనాలు, రుణాలు,సాధారణ భద్రతా పథకాలు ఖాతాదారునికి లభిస్తాయన్నారు.18 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ భద్రత పథకాలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బుడిగ రేణుక పెంటయ్యగౌడ్, యాదగిరిగుట్ట కెనరా బ్యాంకు మేనేజర్, తుర్కపల్లి ఆర్థిక అక్షరస్యత కేంద్రం నోడల్ ఆఫీసర్ సతీష్,సెంట్రల్ బ్యాంకు మేనేజర్, సొసైటీ ఫర్‌సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్,కౌన్సిలర్స్ నాగరాజు,నవీన్, సాయికుమార్, బ్యాంకు మిత్ర తదితరులు పాల్గొన్నారు.

అసైన్ మెంట్ కమిటీ ద్వారా రైతులకు పట్టాలు అందిస్తాం

నవతెలంగాణ -తిరుమలగిరి సాగర్

అతి త్వరలో అసైన్ మెంట్ కమిటీ ద్వారా రైతులకు పట్టాలు అందిస్తామని ఎంఆర్ఓ మధుసూదన్ రెడ్డి అన్నారు.మండలంలోని తిమ్మాయిపాలెం గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పైలెట్ ప్రాజెక్ట్ టీం. 04 ఎంఆర్ఓ మధుసూదన్ రెడ్డి గ్రామ సభలో మాట్లాడుతూ అతి త్వరలో అసైన్ మెంట్ కమిటీ ద్వారా రైతులకు పట్టాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సత్యనారాయణ, కాంగ్రెస్ యువ నేత మేరావత్ మునినాయక్, నాగేందర్ నాయక్, హనుమా నాయక్, బిచ్యాలు నాయక్, రామారావు, సామ్య దస్రు, అంజయ్య, స్వామి నాయక్, రతన్, బాలు, హతిరాం, జింతా, చినేష్,జూనియర్ అసిస్టెంట్ వినోద్, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల దరఖాస్తులను పకడ్బదీగా చేపట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాటి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందించేటటువంటి ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను అధికారులు పకడ్బందీగా పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుర్రపు తండా గ్రామపంచాయతీ పరిధిలోని దర్గా తండాలో అధికారులు నిర్వహిస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేసి వారన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఇండ్లు లేనటువంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందే విధంగా దరఖాస్తులను పూర్తిగా పరిశీలన చేయాలని ఇంద్రమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల్ని ఫోటోతో సహా ఇల్లు మొత్తం కవర్ అయ్యే విధంగా ఫోటోలు తీయాలని అన్నారు. ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నటువంటి లబ్ధిదారులు ఇతర ప్రదేశాలకు వలస వెళ్లినచో వారికి ఫోన్ ద్వారా లేదా ఇతర మార్గం ద్వారా సమాచారాన్ని అందజేసి తక్షణమే గ్రామానికి వచ్చే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని వారు ఎవరైనా ఉంటే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి ప్రజాపాలన కార్యక్రమంలో గానీ లేదా మీ సవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు చూడాలని సర్వే సందర్భంగా ఇండ్లకు సంబంధించినటువంటి పూర్తి వివరాలను ధృవపత్రాలతో సహా పూర్తి వివరాలను అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. వీరి వెంట దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, కొండమల్లేపల్లి ఎంపీడీవో బాలరాజు రెడ్డి తదితరులు ఉన్నారు.

టాలెంట్ టెస్టులో మనీషాకు జిల్లా ప్రథమ స్థానం

నవతెలంగాణ-నూతనకల్

జిల్లా కేంద్రంలోని బాలభవంలో బుధవారం నిర్వహించిన జీవశాస్త్రం టాలెంట్ టెస్ట్ తెలుగు మీడియం విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదనెమిలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని బొల్క మనీష జిల్లాలో మెదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి శివయ్య తెలిపారు. జిల్లా బయోసైన్సు ఫోరం బాధ్యుల షీల్డ్,ప్రశంసా పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.జిల్లా లో మొదటి బహుమతి సాధించిన మనీష ను ప్రోత్సహించిన జీవశాస్త్రం ఉపాధ్యాయురాలు ముత్తినేని ఉమారాణి ని అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హరికృష్ణ, వెంకయ్య, సువర్ణ లక్ష్మి, షమీం సుల్తాన, ప్రశాంతి, సుధీర్ కుమార్, విజయలక్ష్మి, సైదయ్య పాల్గొన్నారు.